సరస్వతి నమస్తుభ్యం

వేడుకగా సామూహిక అక్షరాభ్యాసం





వీరంపాలెంలో తన మనుమరాలికి అక్షరాభ్యాసం చేయిస్తున్న గన్ని వీరాంజనేయులు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 14 : వసంత పంచమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా సర స్వతి ఆలయాల్లోని ప్రత్యేక పూజలు, అక్షరాభ్యాసాలు జరిగాయి. తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం శ్రీ బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం వేడుకగా నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి వందలాది మంది భక్తులు విశేషంగా పాల్గొని అక్షరాభ్యాసాలు చేయించారు. ఉదయం నుంచి భారీగా తమ చిన్నారులను తీసుకుని తల్లిదండ్రులు, బంధువులు తరలివచ్చారు. వారు తమ చిన్నారులతో ఓనమాలు రాయించారు. ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకట రమణసిద్ధాంతి దగ్గరుండి అక్షరాభ్యాసాలు చేయించి, వీరికి ఆశీస్సులు అందించారు. టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు మనుమరాలికి అక్షరాభ్యాసం చేయించి ప్రత్యేక పూజలు చేయించారు.

ఈ గట్టుకు ఏమైంది ?

- నాలుగోసారి కుంగిన గోదావరి గట్టు
- సహజమేనంటున్న అధికారులు..
- భయం భయంగా స్థానికులు..
- ప్రతిపక్షాల ఆందోళన.. పట్టించుకోని సర్కార్



జారిన గోదావరి ఏటిగట్టు



నరసాపురం, ఫిబ్రవరి 14 : నరసాపురం వద్ద రూ.27 కోట్లతో చేపడుతున్న గోదావరి ఏటిగట్టు పనులు మళ్లీ నీళ్లపాలయ్యాయి. వారం రోజులుగా వేసిన రాళ్లన్నీ నీటిలో కలిసిపోయాయి. ఏటిగట్టు పనులు మొదలుపెట్టిన తర్వాత గట్టు కుంగడం ఇది నాలుగోసారి. బుధవారం రాత్రి ఒక్కసారిగా గట్టు కుంగుతూ నీటిలోకి జారిపోయింది. రాళ్ల స్తంబాలు రావడంతో ప్రజలు భయందోళన చెందారు. శనివారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల బృందం ఏటిగట్టును పరిశీలించింది. పనులు చేసేటప్పుడు గట్టు కుంగడం సహజమంటూ తేల్చి చెప్పింది. నేల స్వభావం వల్ల ఈ విధంగా జారీ అవకాశం ఉందని అభిప్రాయపడింది. అయితే చేస్తున్న పనులు ఇలా నీటిపాలవుతూ ఉంటే రేపు వరదల సమయంలో ప్రమాదం తప్పదన్న భయం స్థానికుల్లో నెలకొంది. ప్రస్తుతం గట్టు ఎనిమిది మీటర్లు మాత్రమే మిగిలింది. వరదకు ఇది కూడా గండి పడితే పెనుప్రమాదం తప్పదు. పోటుపాటులకు గోదావరి నీరు కూడా పోటెత్తుతోంది. ఈ క్రమంలో గండి పడితే అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో వేసవి నాటికైనా పటిష్ఠ పనులు చేపట్టాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. తరచూ గట్టు కుంగిపోతుండటంతో ఆ మార్గంలో వెళ్లేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

మట్టి దొంగలు!



లక్ష్మీపురం దగ్గర కనిపించని పోలవరం కుడికాల్వ గట్టు

- అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నేతల దందా
- అర్ధరాత్రిళ్లు యథేచ్ఛగా అక్రమ తరలింపు
- కాసులు కురిపిస్తున్న పోలవరం కాల్వ గట్టు
- అడ్డుకున్నవారిపై దాడులు, తిరిగి కేసులు
- ప్రశాంతంగా ఉండే జిల్లాలో ఫ్యాక్షనిజం ఛాయలు

పచ్చని పంటపొలాలు, అలరారే చెరువులు, వ్యవ సాయ ప్రధానమైన పరిశోధనా సంస్థలు.. ఇది దెందులూరు నియోజకవర్గం ముఖచిత్రం. అయితే ప్రశాంతంగా ఉండే దెందులూరు నియోజక వర్గంలో ఇటీవల దాడుల విష సంస్కృతి రోజురోజుకు పెరుగుతోంది. దెందులూరులో జరుగుతున్న పరిణామాలను 2019కు ముందు ఆ తర్వాతగా పరిశీలిస్తే ఈ ఐదేళ్లలో మట్టి, ఇసుక అక్రమ రవాణా, అడ్డుకోబోయిన వారిపై దాడులు, దౌర్జన్యాలు మితిమీరిపోయాయి. మట్టి మాఫియాకు పోలవరం కుడి ప్రధాన కాల్వ అడ్డాగా మారితే, ఇసుక అక్రమాలకు తమ్మిలేరు సాక్షిభూతంగా నిలిచింది.

పెదవేగి, ఫిబ్రవరి 14 : దెందులూరు నియోజకవర్గంలోని దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాలు ఒక ఎత్తైతే, పెదవేగి మండలంలో జరిగే తంతు మరోఎత్తుగా ఉంటుంది. దీనికి ప్రధాన కారణం ఒకవైపు పోలవరం కుడికాల్వ గట్టు, మరోవైపు తమ్మిలేరు ఇసుక తిన్నెలు. వైసీపీ అధికారంలోకి రాకముందు ఇసుక, మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన వైసీపీ నేతలు, ఇప్పుడు అదే తమ్మిలేరు ఇసుకను తరలించేస్తూ, పోలవరం కాల్వ గట్టును గుల్లచేస్తూ కాసులు పిండుకుంటున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు చేస్తున్న విచ్చలవిడి ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకోబోయిన ప్రతిపక్ష టీడీపీ నేతలపై దాడులు చేస్తున్నారు. ఇంత జరిగినా దాడులు చేసిన వారిపై కేసులు ఉండవు సరికదా తిరిగి బాధితుల పైనే ఎదురుకేసులు నమోదవుతున్నాయి. పెదవేగి మండలంలో ఇటీవల దాడుల విష సంస్కృతి పెరిగింది. దీనికి పోలవరం కుడి ప్రధాన కాల్వ గట్టు వేదికైంది. పోలవరం కుడికాల్వ తవ్వకంతో వచ్చిన



కవ్వగుంట దగ్గర గట్టును తొలిచేస్తున్న దృశ్యం

మట్టిని కాల్వకు రెండువైపులా పోశారు. మట్టి విక్రయాలకు అలవాటు పడిన మాఫియా అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా ఆ మట్టిని విక్రయిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకోజూసిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. గతేడాది నవంబరు పదో తేదీన అర్ధరాత్రి సమయంలో జగన్నాథపురం, లక్ష్మీపురం గ్రామాల పరిధిలో పోలవరం కాల్వ గట్టును తవ్వేస్తున్నారనే సమాచారంతో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభా కర్ అనుచరులతో కలిసి వెళ్లి మూడు ఎక్స్‌కవేటర్లు, తొమ్మిది టిప్పర్లను పట్టుకుని అధికారులకు అప్పగించారు. అంతకుముందుకూడా గట్టు అక్రమ తవ్వకాలను టీడీపీ నేతలు అడ్డుకుని, సంబంధిత వాహనాలను అధికారులకు అప్పగించారు. ఇదే క్రమంలో లక్ష్మీపురం పరిధిలో పోలవరం కుడికాల్వ గట్టునుంచి మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో గతనెల 30వ తేదీన రాత్రి పదకొండు గంటల సమయంలో చింతమనేని అనుచరులతో మరోసారి వెళ్లి మట్టి తరలిస్తున్న వాహనాలను ఆపి అధికారులకు సమాచారం ఇచ్చారు. అనుచరులు అక్కడే ఉండగా, ప్రభాకర్ అక్కడనుంచి వెళ్లిపోయారు. పోలీసులు వచ్చి వాహనాల వివరాలు నమోదు చేసుకుంటుండగానే వైసీపీ శ్రేణులు భారీ సంఖ్యలో వచ్చి, అక్కడ ఉన్న టీడీపీ నాయకులపై దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీ నాయకులు పసుమర్తి మధు, తాతా సత్యనారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. అది మరచిపోకముందే కొప్పాకలో ఆదివారం రాత్రి వైసీపీ శ్రేణులు మూకుమ్మడిగా వచ్చి, టీడీపీ నాయకుల ఇంటిపై దాడికి దిగి, విధ్వంసం సృష్టించారు. పైగా టీడీపీ నాయకులే తమపై దాడి చేశారంటూ వైసీపీ నేతలు మాటల గారడీ చేస్తున్నారు. ఇలా దెందులూరు నియోజక వర్గంలో ఎన్నడూ లేని రీతిలో దాడుల సంస్కృతి పెరిగిపోయింది. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది ఈ దాడులు మరింతగా పెరుగుతాయేమోననే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఎన్నడూలేని రీతిలో రాయలసీమ ఫ్యాక్షనిజం ఛాయలు వేళ్లూనుకుంటున్న దెందులూరు నియోజక వర్గంలో తిరిగి ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంటుందని ప్రజానీకం పేర్కొంటున్నారు.



లక్ష్మీపురం వద్ద రాడ్డుతో టీడీపీ నాయకులను కొడుతున్న వైసీపీ కార్యకర్తలు (ఫైల్)

పశ్చిమ నూతన కలెక్టర్‌గా సుమిత్‌కుమార్

- కలెక్టర్ ప్రశాంతి మార్కెటింగ్ శాఖకు ఆకస్మిక బదిలీ
- వెనుక కారణాలేంటి ?.. సర్వత్రా విస్మయం..





(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అల్లూరి సీతారామరాజు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ నియమితులయ్యారు. ప్రశాంతిని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా నియమించారు. అయితే ప్రశాంతి ఆకస్మిక బదిలీపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. భీమవరం కేంద్రంగా ఏర్పడిన కొత్త జిల్లాకు 2022 ఏప్రిల్ 4న తొలి కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. పాలనను గాడిలో పెట్టేందుకు ప్రయత్నించారు. కలెక్టర్ ప్రశాంతి ముక్కుసూటిగా ఉంటారు. ప్రభుత్వం నిర్ణయాన్ని కచ్చితంగా అమలు చేస్తారన్న అభిప్రాయం అన్నివర్గాల్లోనూ ఉంది. ఆమె హయాంలోనే భీమవరంలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. ఈ బహిరంగ సభ నిర్వహణలోను, సీఎం జగన్ నిర్వహించిన పలు సభల నిర్వహణలోను కలెక్టర్ కీలకంగా వ్యవహరించి ప్రశంసలు పొందారు. పాలనలో ముక్కుసూటిగా ఉంటారు. ప్రజా ప్రతినిధులు ఎన్ని ఒత్తిళ్లు చేసినా నిబంధనలకు లోబడి పనిచేస్తుంటారు. దీనికే కట్టుబడి ఉన్నారు. జిల్లాలోని ఓ మంత్రితో అభిప్రాయభేదాలున్నాయి. మున్సిపల్ కమిషనర్ బదిలీ చేయాలన్న విషయంలో సదరు ప్రజా ప్రతినిధి, కలెక్టర్‌కు మధ్య మరింత దూరం పెరిగినట్టు సమాచారం. కమిషనర్‌పై ఆరోపణలు వస్తుండడంతో బదిలీ చేసేందుకు కలెక్టర్ మొగ్గు చూపారు. దీనికి అధికార పార్టీ ప్రజా ప్రతినిధి విముఖత చూపారు. భీమవరంలోనూ అధికార పార్టీ నేతకు, కలెక్టర్‌కు మధ్య అంతగా సఖ్యత లేదు. భీమవరం ప్రత్యేక అధికారిగానూ కలెక్టర్ వ్యవహరించారు. ఈక్రమంలో అనేక పాలనా పరమైన విధానాల్లో ఇద్దరి మధ్య బేధాభిప్రాయాలు తలెత్తినట్టు ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇటీవల ఓటర్ల జాబితాలో అవతవకలపై బీఎల్‌వోలను సస్పెండ్ చేశారు. మరికొందరు అదే జాబితాలో ఉన్నారు. ఇది కూడా అధికార పార్టీకి కాస్త ఇబ్బందికరంగా మారినట్టు తెలుస్తోంది. ప్రభుత్వానికి సానుకూలంగా ఉంటూనే నిర్ణయాల్లో నిబంధనలకు లోబడి పనిచేశారు. ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లకు లొంగలేదు. ఇదే బదిలీకి ఒక కారణంగా చెప్పుకుంటున్నారు.

సుమిత్ సుపరిచితులే..

నూతన కలెక్టర్‌గా నియమితులైన సుమిత్‌కుమార్ గాంధీ జిల్లావాసులకు సుపరిచితులే. 2014లో నరసాపురం సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురంలో ట్రైనీ కలెక్టర్‌గా, నర్సాపురం సబ్ కలెక్టర్‌గా, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల జేసీగా, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల ఆందోళన



ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఉద్యోగులు ఉద్యమ శంఖారావం పూరించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాయిదాలతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు బుధవారం నుంచి పోరుబాట పట్టారు. ఏపీ ఎన్జీవో సంఘంతో పాటు ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్లు, కార్మిక సంఘాలు ఆందోళన ప్రారంభించారు. ఉద్యోగులు తొలిరోజు ఉద్యమ కార్యాచరణలో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. భోజన విరామ సమయంలో ఆందోళన చేపట్టారు. ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జేఏసీ ఛైర్మన్ కోటగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన బకాయిలను సత్వరమే చెల్లించాలని, అపరిష్కృతంగా ఉన్న అన్ని సమస్యలు పరిష్కారమయ్యే వరకు విశ్రమించేది లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ నెరుసు రామారావు, జేఏసీ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు రవికుమార్, ఆలీ, పి.వి నరసింహారావు, పువ్వుల ఆంజనేయులు, గుగులోతు కృష్ణ, శ్రీధర్‌రాజు, కె.సత్యనారాయణ, వై.శ్రీను, మెరుగు ఫణి, పూడి శ్రీనివాస్, ఇతర సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సహకార నిబంధనలకు తూట్లు

- రుణాలు తీసుకుంటేనే సొసైటీల్లో సభ్యులు.. ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- అమలు జరిగితే త్రిసభ్య కమిటీల్లో పదవులు గోవిందా
- ప్రభుత్వం మౌన పాత్ర

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సహకార సంఘాల్లో ప్రభుత్వ నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదు. సంఘాల్లో రుణాలు తీసుకుంటేనే సభ్యులుగా ఉండాలంటూ ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అది అమలుకు నోచుకుంటే సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలు, డీసీసీబీ, డీసీఎంఎస్ పాలక వర్గాల్లో అనేక మంది పదవులకు అనర్హులుగా మారతారు. అందుకే ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడం లేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార చట్టానికి తూట్లు పడుతున్నాయి. ఎన్నికలను పక్కనపెట్టింది. అధికార పార్టీ నేతలకు సహకార సంఘాల్లో పదవులు కట్టబెట్టింది. అందుకోసం డిపాజిట్ సొమ్ములు కడితే సభ్యత్వం ఉండేలా ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు సభ్యత్వం లేని అధికార పార్టీ నాయకులు డిపాజిట్ చెల్లించారు. సభ్యత్వం తీసుకున్నారు. పదవులు అనుభవిస్తున్నారు. సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలను నియమించి పాలన నిర్వహిస్తున్నారు. జిల్లా సహకార బ్యాంకుల్లో ఛైర్మన్ సహా డైరెక్టర్లను ప్రభుత్వమే నియమిస్తోంది. డీసీఎంఎస్‌లోను అదే తంతు సాగుతోంది. ఇటీవల నిబంధనల్లో మార్పు చేసింది. సహకార సంఘాల్లో సభ్యత్వం ఉండాలంటే రైతులు రుణాలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కౌలు రైతులకు అదే నిబంధనను వర్తింపజేసింది. అదే అమలు జరిగితే జిల్లాలోని సహకార సంఘాలు, డీసీఎంఎస్, డీసీసీబీ పాలకవర్గాల్లో నియమితులైన అనేక మంది పదవులు కోల్పోనున్నారు. దీంతో నిబంధనలు అమలు చేయకుండా నిలిపివేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 258 సహకార సంఘాలు వున్నాయి. అందులో 155 సంఘాల్లో ఉండే కొందరు కమిటీ సభ్యులకు రుణాలు లేవు. కేవలం డిపాజిట్ చెల్లించి మాత్రమే సభ్యత్వం తీసుకున్నారు. తాజా నిబంధనలతో వారి సభ్యత్వం పనికిరాదు. అంటే పదవులు సైతం వదులుకోవాలి. ఫలితంగా ప్రభుత్వమే సదరు నిబంధనలను పక్కన పెట్టిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం అధికార పార్టీ నాయకులకు పదవులు ఇవ్వాలన్న ఉద్దేశంతోనే డిపాజిట్ విధానాన్ని తెరపైకి తెచ్చింది.

తమకు అనుకూలమైన నాయకులనే కమిటీల్లో నియమించుకుంది. వారితోనే పాలన నిర్వహిస్తోంది. దీంతో సహకార సంఘాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా కమిటీలు ప్రశ్నించలేకపోతున్నాయి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పదవీ కాలం పొడిగిస్తూ వస్తున్నారు. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నారు. నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు ఆశీస్సులు వున్న వారికి కమిటీల్లో చోటు లభిస్తోంది. అంతేతప్ప సహకార సంఘాల కమిటీల ఏర్పాటులో రైతులకు ప్రాధాన్యం లేకుండా పోతోంది.

దరఖాస్తే దోపిడీ



- నిరుద్యోగుల నుంచి టెట్, డీఎస్సీ దరఖాస్తులకు అధిక ఫీజులు
- ఆన్‌లైన్‌లో సర్వర్ కష్టాలు.. ఫీజుల కోత
- ఐడీ రాక దరఖాస్తు చేసుకోలేని యువత
- సొమ్ములు పోతున్నాయంటూ ఆందోళన

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం డివిజన్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో రూ.10 వేలకు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న బీఈడీ అభ్యర్థి డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇంటర్‌నెట్ సెంటర్‌కు వెళ్లాడు. టెట్‌లో మార్కులు పెరగాలని మరోసారి రాసేందుకు దరఖాస్తు చేసుకోవాలని భావించాడు. ఒక్కో దరఖాస్తుకు రూ.750 ఫీజు. టెట్‌లో మూడు పేపర్లు, డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవడానికి ఫీజు రూ.3 వేలు. అప్పు చేశాడు. బ్యాంకు ఖాతాలో వేసుకున్నాడు. దరఖాస్తు చేసుకుంటే బ్యాంకు ఖాతాల నుంచి మొత్తం సొమ్ములు కోత అయ్యాయి. కానీ వెబ్‌సైట్ పనిచేయలేదు. అభ్యర్థి ఐడీ రాలేదు. ఐడీతోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అప్పు చేసిన సొమ్ములు పోయాయి. దరఖాస్తుకు నోచుకోలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి సొమ్ములు ఎక్కడి నుంచి తేవాలంటూ అభ్యర్థి ఆందోళన చెందుతున్నాడు. దరఖాస్తు చేసుకున్న సొమ్ములు ప్రభుత్వ ఖాతాలో జమ అయిపోతున్నాయి. తీరా దరఖాస్తు చేసుకోలేక దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది.


సార్వత్రిక ఎన్నికల ముందు ప్రభుత్వం ఉపాధ్యాయుల భర్తీ అంటూ హడావిడి చేస్తోంది. వేలాది పోస్టులు ఖాళీగా ఉంటే కొద్దిపాటి పోస్టులను మంజూరు చేసింది. ఏటా డీఎస్సీ ఉంటుందని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగ యువతకు మొండిచేయి చూపారు. చివరి ఏడాది కేవలం ఆరు వేల ఉపాధ్యాయ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదంతా ఎన్నికల స్టంట్‌గానే భావిస్తున్నారు. పోస్టుల సంఖ్యను పెంచాలంటూ నిరుద్యోగ యువత ఆందోళనలు చేపట్టింది.

విడివిడిగా ఫీజులు

ఉపాధ్యాయ పోస్టుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవాలంటే టెట్ అర్హత సాధించాలి. టెట్‌లో సాధించిన మార్కులు ఆధారంగా డీఎస్సీలో వెయిటేజీ మార్కులు వుంటాయి. గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పుడు మరోసారి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఉపాధ్యాయ పోస్టులు, టెట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. గతంలో దరఖాస్తుకు రూ.250 చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడది రూ.750 చేశారు. నిరుద్యోగులు అంత మొత్తంలో చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు సొమ్ములు చెల్లించిన తర్వాత ఓటీపీ వస్తోంది. అది భర్తీ చేసిన తర్వాత అభ్యర్థి ఐడీ రాకుండానే అభ్యర్థుల బ్యాంకు ఖాతా నుంచి సొమ్ములు కోత అయిపోతున్నాయి. అభ్యర్థి ఐడీ వస్తేనే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. సర్వర్ సమస్యతో అభ్యర్థి ఐడీ రావడం లేదు. మరోవైపు సొమ్ములు కోల్పోయి అభ్యర్థులు గగ్గోలు పెడుతున్నారు. ఇలా జిల్లాలోనే వందల మంది అభ్యర్థులకు బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ములు కోత అయిపోయాయి. కానీ దరఖాస్తు చేసుకోలేకపోయారు. సర్వర్ సమస్య వల్ల వెబ్‌సైట్ సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో అభ్యర్థుల దరఖాస్తు ప్రక్రియ పూర్తి కావడం లేదు. బయటకు చెప్పితే ప్రభుత్వపరంగా ఇబ్బందులు పడతామన్న గుబులు వారిని వెంటాడుతోంది.

గంపెడాశతో..

- వేసవి వనామి సాగు ప్రారంభం
- రైతులకు భారంగా సీడ్



కలిదిండి, ఫిబ్రవరి 14 : వేసవి కాలం రొయ్యల సాగు ప్రారంభమైంది. శీతాకాలం చెరువులు ఎండబెట్టారు. ప్రస్తుతం వేసవి సాగుకు చెరువులకు నీరు పెట్టారు. వైజాగ్, తుని, నెల్లూరు, పాండిచ్చేరి ప్రాంతాల నుంచి రొయ్యల సీడ్‌ను వ్యాన్‌లపై తీసుకొచ్చి చెరువుల్లో వదులుతున్నారు. శీతాకాలం పంట ఆశాజనకంగా లేకపోవడంతో వేసవి పంట పైనే రొయ్యల రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. ఏడాదికి మూడు పంటలు పండించేవారు. క్రమేణా ఆ పద్ధతి లేకుండా పోయింది. వ్యాధుల బారిన పడి చెరువుల్లో రొయ్యలు కౌంటుకు రాకుండానే ముందస్తుగా పట్టడం ఆ తర్వాత ఎవరికి అనుకూలంగా ఉన్న సమయంలో వారు సాగు చేయడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం వేసవి వనామి సాగుకు అనుకూలంగా ఉండడంతో వేలాది ఎకరాల్లో సాగుకు సమాయత్తమవుతున్నారు. కొంతకాలం నుంచి ఆక్వా సాగు ఒడిదుడుకుల్లో ఉంది. వైరస్ బారిన పడి రొయ్యలు మృత్యువాత పడడంతోపాటు మేత ధరలు, విద్యుత్ చార్జీల లీజు ధరలు పెరిగిపోవడంతో సాగుదారులు నష్టపోయారు. సీడ్ నాణ్యత లేకపోవడమే వైరస్ బారిన పడడానికి కొంత కారణమని సాగు దారులు చెబుతున్నారు.

ఎకరానికి 3 నుంచి 4 లక్షల రొయ్య పిల్ల

రైతులు ఎకరానికి 3 నుంచి 4 లక్షల రొయ్య పిల్లలు వదులుతున్నారు. కొంతమంది రైతులు 5 లక్షల వరకు రొయ్య పిల్లలు వదులుతున్నారు. వాస్తవానికి నాణ్యత గల సీడ్ అయితే ఎకరానికి లక్షన్నర రొయ్య పిల్ల సరిపోతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో రొయ్యల సీడ్ ధర 35 పైసల నుంచి 40 పైసలు పలుకుతోంది. రొయ్య పిల్లల్లో కొన్ని చనిపోతాయని భావించి రైతులు అదనపు పెట్టుబడితో 4 లక్షల వరకు రొయ్య పిల్లలు కొనుగోలు చేసి తొలి దశలోనే భారం మోస్తున్నారు.

'వేసవి సీజన్‌లో వాతావరణం అసమతుల్యత నెలకొంది. దీనివల్ల సీడ్ దశలో వైరస్ సోకే ప్రమాదం ఉంది. రైతులు పీసీఆర్ పరీక్షలు చేయించిన రొయ్య పిల్లలను పంచుకోవాలి. ప్రస్తుతం రొయ్యల చెరువుల్లో వైట్ గట్, వైరస్ అధికంగా ఉంది. ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే సీడ్ నాణ్యత చూసుకోవాలి.'.. అని మత్స్యశాఖాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు.



పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

అమ్మవారి విగ్రహం అప్పగించాలి

పాలకొల్లులో హిందూ సంఘాల ఆందోళన

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి, 14 :పాలకొల్లు పట్టణం రామయ్యహాలు చెర్వులో దొరికిన వైష్ణవి అమ్మవారి విగ్రహాన్ని అప్పగించాలని కోరుతూ హిందూ సంఘాల నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సుమారు 7 గంటల పాటు ఆందోళన చేపట్టారు. దీంతో నరసాపురం డీఎస్పీ మనోహరాచారి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.మూడు రోజులు క్రితం రామయ్యహాలు చెర్వులో వైష్ణవి అమ్మవారి విగ్రహం దొరికింది. దీంతో స్థాని కులు అమ్మవారి విగ్రహానికి పూజలు నిర్వహిస్తుండగా క్రైస్తవ సంఘాల నాయ కులు అభ్యంతరం చెప్పడంతో అమ్మవారి విగ్రహాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అమ్మవారి విగ్రహాన్ని తమకు అప్పగించాలని కోరుతూ హిందూ సంఘాలు ఆందోళనకు పిలుపునిచ్చాయి. దీంతో బుధవారం మున్సిపల్ కార్యా లయం ఎదుట విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సభ్యులు ఆందోళనకు మద్దతు పలికారు.హిందూ దేవుళ్ళపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. మున్సిపల్ కమిషనర్‌తో పోలీసు, రెవెన్యూ అధికారులు ఇరువుల సంఘాల సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపారురు. ఎమ్మెల్యే రామానాయుడు కూడా వారి మాట్లాడారు. రామయ్య హాలు వద్ద విగ్రహం ఏర్పాటుకు స్థలం ఇవ్వాలని కోరారని టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం రాగానే స్థల సేకరణ చేసి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కోటిపల్లి లైన్‌కు వేగంగా భూసేకరణ

రద్దీకి అనుగుణంగా వేసవిలో ప్రత్యేక రైళ్లు

భీమవరం వరకు వందేభారత్ పొడిగించే యోచన



స్టేషన్ తనిఖీ చేస్తున్న ఏజీఎం ధనుంజయులు

నరసాపురం, ఫిబ్రవరి 14: కోటిపల్లి రైల్వేలైన్ పనులకు సంబంధించిన భూ సేకరణ ఊపందుకుందని దక్షిణ మధ్య రైల్వే ఏజీఎ ధనుంజయులు చెప్పారు. బుధవారం నరసాపురం రైల్వేస్టేషన్‌ను ఆయన సందర్శించి విలేకర్లతో మాట్లాడారు. ఒప్పందం ప్రకారం కోటిపల్లి ప్రాజెక్టుకు అయ్యే వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం చెల్లించాల్సి ఉందన్నారు. ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.300 కోట్లు కేటాయించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటా మొత్తాన్ని చెల్లిస్తే పనులు శరవేగంగా జరుగుతాయన్నారు. ఈ వేసవిలో రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే సన్నాహాలు చేస్తుందన్నారు. విజయవాడ నరసాపురం మధ్య డబ్లింగ్ లైన్ పూర్తయినందున కొత్త రైళ్ళను ప్రవేశపెడతామన్నారు. ప్రస్తుతం చెన్నై- విజయవాడల మధ్య నడుస్తున్న వందేభారత్‌ను భీమవరం వరకు పొడిగించే ఆలోచన పరిశీలనలో ఉందన్నారు. అంతకు ముందు నరసాపురం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనుల్ని ఆయన పరిశీలించారు. గ్యారేజీ,ఐవోహెచ్ షెడ్యూల్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఆయన వెంట ఏడీఆర్‌ఎం శ్రీకాంత్, సీనియర్ డీసీఎం రాంబాబు, డీఈఎన్ శ్రీధర్, ఏడీఎన్ శంకర్‌రావు, ఎస్‌ఎంలు మధుబాబు, దివాకర్ ఉన్నారు.

ఆంధ్రా సుగర్స్‌లో టీడీఎస్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఇంకమ్ టాక్స్ అధికారి నందూరి శ్రీనివాసరావు

తణుకు, ఫిబ్రవరి 14: వేతనాలు చెల్లింపులో డ్రాయింగ్ అధికారులు ఆదాయ పన్ను నిర్దేశించిన రేట్ల ప్రకారం టీడీఎస్ మినహాయించి ఆ మొత్తాన్ని సకాలంలో ప్రభుత్వానికి జమ చేయాలని విశా ఖ పట్నం ఆదాయ పన్ను అధికారి నందూరి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆంధ్రా సుగర్స్ సమావేశ మందిరంలో పన్ను మిన హాయింపుపై డ్రాయింగ్ అధికా రులకు, డిస్పర్సింగ్ అధికారులకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ త్రైమాసిక టీడీఎస్ స్టేట్‌మెంట్లను సకాలంలో దాఖలు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. టీడీఎస్‌కు సంబంధించిన సందే హాలు నివృత్తి చేశారు. ఆంధ్రాసుగర్స్ వైస్ ప్రెసిడెంట్ ఫైనాన్స్ విశ్వనాధకుమార్, విశాఖపట్టణం ఇన్‌కమ్‌టాక్సు ఇన్‌స్పెక్టర్ డి.శ్రావణి సిబ్బంది పాల్గొన్నారు.

నిట్‌ను టాప్ 10లో నిలిపేందుకు కృషి చేస్తా

ఇన్‌చార్జి డైరక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బీఎస్ మూర్తి



తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 14 : ఏపీ నిట్‌ను ప్రగతి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. హైదరాబాద్ ఐఐటీ డైరక్టర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్న బీఎస్ మూర్తికి ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరక్టర్‌గా బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు నాగపూర్ నిట్ డైరక్టర్ డాక్టర్ ప్రమోద్‌పడోలే ఇన్‌చార్జి డైరక్టర్‌గా ఉన్నారు.విద్యార్థులనుద్దేశించి బీఎస్ మూర్తి మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యార్థుల భాగసామ్యం అత్యంత కీలకమైనదని ప్రజలకు మేలు చేసే విభిన్న పరిశోధనలు, ప్రాజక్టులపై దృష్టి సారించాలన్నారు. దేశంలో 31వ నిట్‌గా అవతరించిన ఏపీ నిట్‌ను టాప్ 10 లోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. డీన్‌లు జీఆర్‌కే శాస్త్రి, కురుమయ్య, జయరాం, వీరేష్‌కుమార్, కార్తిక్ శేషాద్రి, ఆచార్యులు సందీప్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు

రేషన్ డీలర్ల ద్వారానే సరుకులు పంపిణీ చేయాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 14: ప్రజా పంపిణీ వ్యవస్థ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేయాలని తిరిగి డీలర్ల ద్వారానే సరుకులు పంపిణీ జరిపించాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అన్నారు. బుధవారం ఏలూరులో రేషన్ డీలర్ల సమావేశం నిర్వ హించారు. డీలర్ల స్థానంలో వచ్చిన ఎండీయూ విధానం లోప భూయిష్టంగా మారిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రేషన్‌డీలర్లకు ఇస్తున్న గౌరవవేతనంతో పాటు కమిషన్ ఇవ్వాలని గ్రామాల్లో 7,500, పట్టణాల్లో రూ.10 వేలు అందించాలని డిమాండ్ చేశారు. డీలర్ల సమస్యల పరిష్కారానికి అన్ని జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రాజులపాటి గంగాధర్‌రావు మాట్లాడుతూ కష్టనష్టాలకు ఓర్చి అంకితభావంతో పనిచేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీమా సౌకర్యం,మట్టి ఖర్చులకు రూ.15 వేలు మంజూరు చేయాలని,డీలర్ల కోసం సంక్షేమనిధి, హెల్త్ కార్డులు అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. చిందా కృష్ణంరాజు, పి.శివకుమార్,శిరాజ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లిఖార్జునరావు

ఉండి, ఫిబ్రవరి 14: తేనెటీగల పెంపకం ద్వారా తేనెతో పాటు మరెన్నో ఉత్ప త్తులు పొందవచ్చునని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లిఖార్జునరావు అన్నారు. బుధవారం ఉండి మండలం ఎన్‌ఆర్‌పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో తేనెటీగల పెంప కంపై ప్రత్యేక శిక్షణ తరగుతులను నిర్వహించారు. తేనెటీగల పెంపకం రానున్న రోజులలో లాభదాయకమైన వ్యాపారంగా మారు తుందన్నారు. కీటక విభాగం శాస్త్రవేత్త రాజేష్ తేనెటీగల నుంచి వచ్చే ఉత్పత్తులు, తేనెటీగల పెంపకం గురించి వివరించారు. శాస్త్రవేత్తలు డిబోరా మోషి యానా, ఎ.శ్రీనివాసరావు, వినయలక్ష్మి, బి.రజిత తదితరులు పాల్గొన్నారు.

అవే అవస్థలు

నరకం చూపిస్తున్న రోడ్లు

ఎటు చూసినా గోతులమయం

ఆంధ్రజ్యోతి ఫోకస్



గోతులమయంగా ప్రత్తిపాడు- నవాబ్‌పాలెం రహదారి

నాలుగున్నరేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధి ఊసే ఎత్తలేదు. రహదారులు ఎంత అధ్వానంగా తయారయ్యాయో అందరికీ తెలుసు. గోతులు పడిన రోడ్లపై నరకం చూశారు. ఎంతోమంది వాహనాలపై నుంచి పడి ఆసుపత్రుల పాలయ్యారు. వాహనాలు మరమ్మతులకు వచ్చి షెడ్లకు వెళ్లాయి. అస్తవ్యస్త రోడ్లపై ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా, ఎన్ని ప్రమాదాలు జరిగినా.. ఎన్ని మరణాలు సంభవించినా ప్రభుత్వం మాత్రం మొద్దునిద్ర పోతోంది.. ఎన్నికల దగ్గర పడుతున్న వేళ నిధులు వెచ్చించామని రోడ్లన్నీ తీర్చిదిద్దామని ప్రభుత్వం చెబుతోంది.. కానీ ఇంకా రోడ్లపై జనం అవస్థలు పడుతూనే ఉన్నారు.. ఇవే అందుకు సాక్ష్యాలు..

పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి 14 : పాలకొల్లు నుంచి గొల్లవాని చెర్వు వడ్లవానిపాలెం వెళ్లే జడ్పీ రహదారి నాలుగు సంవత్సరాలుగా అస్తవ్యస్తంగా ఉంది. ప్రమాదాలు జరుగుతునా అధికారులు ప్రజల ప్రాణాలను గాల్లోకి వదిలేశారు. నిత్యం ఈరహదారి గుండా తణుకు తాడేపల్లిగూడెం వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో వందలాది మంది ప్రయాణం చేస్తుంటారు. నాగరాజుపేట నుంచి గొల్లవాని చెర్వు గ్రామం వరకూ ఉన్న బీటీ రోడ్డు గోతులమయం అవడంతో ప్రజలు నిత్యం ప్రమాదాలు బారిన పడుతున్నారు. బ్రాడీపేట బైపాస్ నుంచి బంగారు వారి చెర్వుగట్టుకు వెళ్లే రహదారి ఐదేళ్లుగా కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. విద్యార్థులు వందలాది మంది సైకిళ్లు వేసుకొని ఈరోడ్డుపై ప్రయాణం చేస్తుంటారు. ఈ గోతుల్లో పడి తమ పిల్లలకు దెబ్బలు తగులుతున్నాయంటూ విద్యార్థి తల్లిదండ్రులు వాపోతున్నారు.



కనీస మరమ్మతులైనా చేపట్టాలి

చిలుకూరి ద్రాక్షారామ భీమన్న, పాలకొల్లు

నిత్యం నాగరాజు పేట నుంచి గొల్లవాని చెర్వు మీదుగా తణుకు తాడేపల్లి గూడెం వైపు నిత్యం వందలాది వాహనాలు, స్కూలు పిల్లలు సైకిళ్లపై వస్తున్నారు. ఈ రహదారి అస్తవ్యస్తంగా ఉండటం వల్ల కింద పడి గాయాలు పాలవుతున్నారు. జడ్పీ చైర్మన్‌గా పనిచేసిన కవురు శ్రీనివాసు కూడా ఈరోడ్డు గురించి పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులైనా చేసి ప్రమాదాల బారిన పడకుండా ప్రజలను కాపాడాలి.

- **పోడూరు** : పోడూరు నుంచి తూర్పుపాలెం వెళ్లే రోడ్డు గోతులు గొప్పులతో అధ్వానంగా ఉంది. నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తున్నారు. చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. నాలుగున్నరేళ్లుగా ఈ రోడ్డును పట్టించుకునే నాధులు లేడంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.
- **పెంటపాడు** : కే.పెంటపాడు నుంచి పడమరవిప్పర్రు వెళ్ళే రహదారి గోతులతో అధ్వానంగా మారింది. ఏళ్ళ తరబడి సమస్య ఉన్న నేటికి పరిష్కారానికి నోచుకోలేదు. ఈ రహదారికి నిధులు మంజూరయ్యాయని పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ప్రజాప్రతినిధులు చెప్పుకొస్తున్నారు. అప్పుడప్పుడు వారికి గుర్తుకు వచ్చినప్పుడు తాత్కాలికంగా గోతులను పూడ్చి చేతులు దులుపుకుంటున్నారు.ఈ రోడ్డు ప్రయాణికులతో ఎల్లప్పుడూ రద్దీగా ఉంటుంది. గోతులతో అస్తవ్యస్తంగా ఉన్న రహదారిపై ప్రయాణాలు సాగించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక తాడేపల్లి గూడెం రూరల్ మండలం నవాబ్ పాలెం బ్రిడ్జి నుంచి ప్రత్తిపాడు వరకూ ఉన్న రోడ్డు కూడా గోతులతో దారుణంగా తయారైంది. ప్రత్తిపాడు సమీపంలో అడుగడుగునా గోతులే.. నెలల తరబడి సమస్య ఉన్నా నేటికి ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. రాత్రి వేళలో గోతులు అంచనా వేయలేక పడిపోతున్నారు.
- **ఉండి** : ఉండి-చేబ్రోలు జాతీయరహదారిలో ఈ మధ్యనే పూడ్చిన రహదారి గోతులు పడి ప్రమాదకరంగా మారుంది. ఉండి పెద్దవంతెన సెంటర్ గణపవరం రహదారిలో పెద్దగొయ్యి పడింది. ఉండి గణపవరం రహదారిలో పది ఎకరాలు తూము ప్రాంతంలో రోడ్డు పెచ్చులూడుతోంది. కోలమూరు శివారున రహదారి టర్నింగ్‌లో పూడ్చిన గొయ్యి ఎత్తుపల్లాలుగా వుండడంతో ప్రమాదకరంగా మారింది.
- **ఆకివీడు రూరల్** : ఆకివీడు నుంచి కాళ్ళ మండలంలోని కాళ్ళ గ్రామాలను కలుపుతూ సుమారు 8 కి.మీ మేర రహదారి అధ్వాన్నంగా ఉంది. చినిమిల్లిపాడు-మాలవానితిప్ప రహదారిలో ఆకివీడు-కాళ్ళ రహదారి గోతులు మయమైంది. ఐదేళ్లుగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ప్రయాణించాలంటే నరకం అనుభవిస్తున్నామని వాపోతున్నారు. రైల్వేగేటు తరచూ పడుతుండ టంతో భీమవరం వెళ్ళేవారందరూ ఆకివీడు నుంచి కాళ్ళ మీదుగా వెళుతుండడంతో రాకపోకలు పెరిగాయి. రహదారి నిర్మాణానికి 2.05 కోట్లు రూపాయలు ఈమధ్యనే మంజూరయ్యాయి. ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభమవ్వలేదు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.
- **గణపవరం** : గణపవరం మండలం పిప్పర నుంచి యండగండి మీదుగా భీమవరం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా తయారైంది. ఎంతో కాలంగా ఈ రహదారిని పునఃనిర్మించాలని ప్రజలు అనేక ఆందోళన ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. ఎట్టకేలకు భీమవరం నుంచి సుమారు 12 కిలోమీటర్ల యండగండి వరకు రహదారి నిర్మాణ పనులు జరిగాయి. అయితే యండగండి నుంచి పిప్పర వరకు మిగిలిన రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. భీమవరం నుంచి యండగండి, పిప్పర, తాడేపల్లిగూడెం వరకు ఈ రహదారిని నేషనల్ హైవేగా కేంద్ర ప్రభుత్వం గత ఏప్రిల్‌లో ప్రకటించింది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



అధ్వానంగా ఉన్న పాలకొల్లు నాగరాజుపేట నుంచి గొల్లవాని చెర్వు వెళ్లే రోడ్డు...



పిప్పర- యండగండి రోడ్డు



ఉండి పెట్రోల్ బంక్ ప్రాంతంలో పెచ్చులూడిర రోడ్డు



ఆకివీడు-కాళ్ళ మార్గంలో గోతులుపడిన రహదారి

జగన్‌కు విజన్ లేదు

మళ్లీ గెలిస్తే అభివృద్ధి ఉండదు

గ్రూపులను ప్రోత్సహించవద్దు.. కలిసి నడుద్దాం

నూజివీడులో గెలుస్తానని ఇక్కడకు పంపారు

ముద్దరబోయినను కలుస్తా : ఎమ్మెల్యే పార్థసారథి



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కొలుసు పార్థసారథి

నూజివీడు, ఫిబ్రవరి 14 : 'జగన్ సర్కార్‌కు అభివృద్ధిపై ఎటువంటి విజన్ లేదు. మళ్లీ ఇదే కొనసాగితే రాష్ట్రానికి అభివృద్ధి అనేదే ఉండదు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో తాను పెనమలూరుకు వంతెనను శంకుస్థాపన చేస్తే అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం 80 శాతం పనులు పూర్తిచేసింది. ఆ మిగిలిన 20 శాతం పనులకు జగన్ సర్కార్ ఒక్క రూపాయి విడుదల చేయలేదు. దీనిపై సీఎంను అడిగి విసిగిపోయాను. నా సొంత డబ్బు కోటిన్నర వెచ్చించి ఆ వంతెనను పూర్తి చేయించా. ఫలితంగా విజయవాడ ట్రాఫిక్ కష్టాలు ఇప్పుడు తీరాయి' అని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు టీడీపీ అభ్యర్థిగా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఆయన తొలిసారి బత్తులవారిగూడెంలో టీడీపీ అధ్యక్షులు ముసునూరు రాజా నివాసగృహం వద్ద పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గ్రూపులను ప్రోత్సహించే సంస్కృతి వద్దు. నాయకుల పనితీరును ప్రజలు గమనిస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్ని గ్రూపులున్నా సమస్యలపై కలిసి కూర్చొని పరిష్కరించుకుని, ఏకతాటిపైకి వచ్చి టీడీపీని అధికారంలోకి తీసుకువద్దాం. రెండు పర్యాయాలు ఇక్కడి నుంచి పోటీ చేసిన ముద్దరబోయిన వెంకటేశ్వర రావు కృషి మరువలేనిది. ఆయనను తప్పించి నాకు టిక్కెట్ ఇవ్వాలని చంద్రబాబును కోరలేదు. టీడీపీలోకి వస్తానని చెప్పినప్పుడు పెనమలూరు నుంచే నాకు టిక్కెట్ ఇస్తారని ఆశించాను. చంద్రబాబు, సర్వే చేయించామని నూజివీడులో నువ్వు గెలుస్తావంటూ చెప్పారన్నారు. అచ్చెన్నాయుడు, యన మల రామకృష్ణుడు కూడా నూజివీడు వెళ్లి పని చేసుకోవాలన్నారు. కానీ, నేను 40 రోజులపాటు పెనమలూరు సీటు కోసమే వేచి చూశానన్నారు. పెనమలూరుతో నా కుటుంబానికి 50 ఏళ్ల అనుబంధం ఉంది. వారిని వదిలి రావాలంటే ఎంతో మానసిక ఇబ్బందిని ఎదుర్కొంటున్నా' అని పార్థసారథి చెప్పారు. ముద్దరబోయినను కలిసి రావడానికి ఆయన ఇంటికి వెళ్లి వచ్చాను. ఆయన అందుబాటులో లేరు. మళ్లీ కలిసేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. సమావేశంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు ముసునూరు రాజా, యనమదల సత్యనారాయణ, బత్తులవారిగూడెం, ముసునూరు లక్ష్మీకాంతమ్మ, కొనకళ్ళ నరసింహారావు, ఆరేపల్లి శ్రీనివాసరావు, గద్దె రఘుబాబు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆగిరిపల్లిలో ముఖ్య నాయకులను కలిసి సహకరించాలని కోరారు.

కొవ్వలిలో ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్



దెందులూరు, ఫిబ్రవరి 14 :విద్యార్థులు చదువుతో పాటు ప్రయోగాలు చేస్తు భవిష్యత్తు తరాలకు ఉప యోగపడే ప్రాజెక్టులు తయారు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహాం అన్నారు. బుధవారం కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో 300 మంది 100 మోడల్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రయోగాలను జిల్లా డీసీఆర్‌బీ ఆఫీసర్ సర్వేశ్వరావు, హెచ్‌ఎం శర్మ, సైన్సు ఉపాధ్యాయుల బృందం పరిశీలించింది. 13 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి సైన్సు ఇన్‌స్పైర్‌కు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వం రూ.10 వేలు అంది స్తుందని హెచ్‌ఎం తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సైన్సు ప్రయోగాల నిర్వహణ సెలక్షన్ అధికారి జైన్ పాల్గొన్నారు

పోలీస్ ఎంప్లాయిస్ మినిస్టీరియల్ యూనియన్

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణంరాజు



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 14 : ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఎంప్లాయిస్ మినిస్టీరియల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏలూరుకి చెందిన పోరంకి శ్రీకృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం విజయవాడలో ఏపీ పోలీస్ ఎంప్లాయిస్ మినిస్టీరియల్ యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. 15 మందితో కమిటీని ఎన్నుకున్నారు

శతాధిక వృద్ధురాలి మృతి

పెదవేగి, ఫిబ్రవరి 14: పెదవేగి మండలం విజయరాయికి చెందిన శతాధిక వృద్ధురాలు పరుచూరి అన్నపూర్ణమ్మ (100) బుధవారం మృతి చెందారు.ఆమె కుమార్తె, అల్లుడు కూడా కొంతకాలం కిందట మృతిచెందగా, మనుమడు ఆమెకు అన్ని సపర్యలు చేశారు. అన్నపూర్ణమ్మ మృతిపట్ల గ్రామస్థులు, పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

పెదపాడు, ఫిబ్రవరి 14 :అప్పటివరకు చిరునవ్వులు చిందించిన ఆ చిన్నారి నవ్వులు బోసిపోయాయి. అప్పటిదాకా ఆడుకుంటూ ఉన్న ఆ చిన్నారిని ఆ ఇంటి ఆవరణలో ఉన్న నీటి తొట్టి పొట్టన బెట్టుకుంది. పెదపాడు మండలం కలపర్రుకు చెందిన దయాల సురేష్‌కు కుమారుడితో పాటు 13 నెలల కుమార్తె నిత్య ఉంది. బుధవారం ఉదయం ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఇంటి ఆవరణలో ఉన్న నీటితొట్టెలో పడిపోయింది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించలేదు. కొంతసేపటికి చిన్నారి కనిపించడం లేదని గమనించిన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు. చివరిగా నీటితొట్టెలో చూడగా చిన్నారి శవమై కనిపించింది. నీటిలో ఊపిరాడక చిన్నారి మృతి చెందింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



భీమవరం క్రైం, ఫిబ్రవరి 14 : భీమవంరం వన్‌టౌన్ బస్టాండ్ ఎదురుగా ఉన్న సందులో వరలక్ష్మీ బార్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు తెలిసిన వారు భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ని సంప్రదించాలని పోలీసులు తెలి పారు. సీఐ ఫోన్ నెంబర్ 94407 96632, ఎస్‌ఐ ఫోన్ నెంబర్. 94407 96633 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

అప్పుల బాధ భరించలేక వీఆర్‌ఏ ఆత్మహత్య



దుర్గాప్రసాద్ (ఫైల్)

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 14 : అప్పులబాధ భరించలేక వీఆర్‌ఏ ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జామా మసీదు ప్రాంతంలో నివాసం ఉంటున్న నాయుడు దుర్గాప్రసాద్ (38) గుండుగొలను వీఆర్‌ఏగా పనిచేస్తూ ప్రస్తుతం డిప్యూటేషన్‌పై భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఏడాదిన్నర క్రితం లలిత అనే ఆమెను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమె అప్పటికే తన మొదటి భర్తకు విడాకులు ఇచ్చి ఇద్దరు సంతానంతో ఉంది. దుర్గా ప్రసాద్‌కు అప్పులు ఉన్నాయని చెప్పేవాడని పేర్కొంది. బుధవారం ఉదయం ఆఫీసుకు రెడీ అయిన అతను ఇంట్లోకి వెళ్లి తలుపులు గడియ పెట్టుకున్నాడని ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో ఇరుగుపొరుగు వారి సాయంతో తలుపులు పగులగొట్టగా ఉరి వేసుకుని ఉన్నాడని వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్లగా మృతిచెందాడని డాక్టర్లు తెలిపారు. ఆసుపత్రి వైద్యులు ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 14 : ట్రాక్టర్ ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామానికి చెందిన మర్రాపు దుర్గాప్రసాద్ (41)ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం ట్రాక్టర్‌పై వెళుతూ సెంటర్ వద్ద ఇంజన్ ఆన్‌లో ఉండగానే కిందకు దిగుతుండగా అతని లుంగీ గేర్ రాడ్డుకు తగిలి గేర్‌పడి ట్రాక్టర్ ముందుకు కదిలింది. అంతలో అతను తూలి కింద పడిపోవడంతో ట్రాక్టర్ పెద్ద చక్రం అతని మీద నుంచి వెళ్ళిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో హెడ్‌కానిస్టేబుల్ సత్యారావు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 14 : ఒక లారీ డ్రైవర్ బహిర్భూమికి వెళ్ళి అక్కడ అనుమానాస్పదంగా మృతి చెందాడు. పెదవేగి మండలం భోగాపురానికి చెందిన పామర్తి సతీష్‌కుమార్ (31)బుధవారం ఉదయం డ్యూటీ దిగి కంద్రికగూడెం లారీ ఆఫీసు వద్దకు వెళ్ళి పడుకున్నాడు. ఆ తరువాత తనను చొదిమెళ్ళ సెంటర్ వద్ద దించాలని వేరే ఉద్యోగి కోరడంతో అక్కడ దించాడు. చొదిమెళ్ళ శివారు బహిరంగ ప్రదేశంలో బహిర్భూమికి వెళ్ళే నిమిత్తం వెళ్లగా అక్కడే మృతి చెంది ఉన్నాడు. అతను గ్యాస్ నొప్పితో బాధపడు తున్నాడని గ్యాస్ నొప్పి వచ్చి గుండెపోటుతో మరణించి ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఏలూరు రూరల్ ఎస్‌ఐ రాజారెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెదవేగి, ఫిబ్రవరి 14 : రెండురోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. పెదవేగి మండలం జగన్నాధపురానికి చెందిన సుసాని వెంకటేశ్వరరావు భార్యతో కలిసి ఈనెల 12 ఉదయం పదిగంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఏలూరు వెళ్తున్నారు. వంగూరు సమీపంలో ఏలూరు- చింతలపూడి రహదారిపై ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొనడంతో వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడగా అతనిని తొలుత ఏలూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్ళారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. భార్య స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

బంగారం చోరీ..కేసు నమోదు

టి.నరసాపురం, ఫిబ్రవరి 14 :తెడ్లం గ్రామానికి చెందిన కేతిరెడ్డి సత్యనారాయణ రెడ్డి వ్యాపారం నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చి బీరువా చూడగా దాచిన 9 కాసుల బంగారం కనిపించలేదు. అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై అనుమానంతో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు టోకరా

రుణాలు, సబ్సిడీ వాహనాలు ఇప్పిస్తానంటూ మోసం

పోలీసుల్ని ఆశ్రయించిన బాధితులు

నరసాపురం రూరల్; ఫిబ్రవరి 14: దివ్యాంగుల సంక్షేమ సంఘంలో పని చేస్తున్నా..రుణాలు, సబ్సిడీపై వాహనాలు ఇప్పిస్తానని నమ్మబలికి పలువురు నుంచి వేలాది రూపాయిలు దండుకుంటున్న మోసగాడి బాగోతం నరసాపురంలో వెలుగుచూసింది. రెండు రోజుల క్రితం జిల్లా ఎస్పీ నిర్వహించిన స్పందనలో దివ్యాంగుడు సూర్యప్రకాష్ ఫిర్యాదుతో మోసగాడి బాగోతాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. బాధితుల కథనం ప్రకారం పాలకొల్లు మండలానికి చెందిన కె.వెంకటేశ్వరావు గత ఏడాది నరసాపురం మండలం వైఎస్ పాలేనికి వచ్చేశాడు. జిల్లా దివ్యాంగుల శాఖలో పని చేస్తున్నానని నమ్మ బలికాడు. ఆర్టీసీ, రైల్వే పాస్‌ల కోసం పలువురు నుంచి దరఖాస్తులు తీసుకున్నాడు. ఇందుకు రూ. 200 నుంచి రూ.300 వరకు వసూలు చేశాఉ. నెల రోజుల తరువాత బస్ పాస్‌లు అందించాడు. రైల్వే పాస్‌లు రాలేదని, అవికూడా తీసుకుని వస్తానని నమ్మించాడు. దివ్యాంగులతో పరిచయం పెంచుకున్నాడు. రెండు నెలల తరువాత గ్రామానికి వచ్చి సబ్సిడీపై మూడు చక్రాల బండి ఇస్తామని నమ్మించాడు. ఇందుకు రూ.20 నుంచి రూ.40 వేలు వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అతను ఉద్యోగి అని భావించిన దివ్యాంగులు అతనికి యూపీఏ ద్వారా సొమ్ము పంపించారు. నెలలు గడిచినా వాహనాలు రాలేదు. ఫోన్ చేస్తే ఇదిగో.. అదిగో.. అంటూ నమ్మించాడు. అనుమానం వచ్చిన దివ్యాంగులు సంఘం పెద్దల్ని ఆశ్రయించారు. ఆరా తీయగా ఈ మోసగాడు చాలామందిని ఈ విధంగా దగా చేసినట్లు బయటపడింది. ఇతగాడు ఆశాఖలో ఉద్యోగి కాదని తెలింది. దీంతో ఇద్దరు నరసాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరో బాధితుడు ఇటీవల జిల్లా ఎస్పీని కలిసి న్యాయం చేయాలని కోరారు. వైఎస్ పాలెంలోనే దాదాపు రూ.లక్ష దండుకుంటున్నట్లు తెలిసింది. మిగిలిన గ్రామాల్లో కూడా ఇదే విధంగా వసూళ్ల చేశారన్న వాదనలు ఉన్నాయి. రూరల్ ఎస్సై గురవయ్య వివరణ ఇస్తూ దివ్యాంగుల నుంచి ఫిర్యాదులొచ్చాయి. మోసగించిన వ్యక్తి కోసం వెతుకుతున్నాం. అతను ఇచ్చిన ఫోన్ నెంబర్, అడ్రస్‌లు సరైనవి కావు.బాధితులు చెప్పిన వివరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నాం.

బంగారం తాకట్టు పెట్టి డబ్బులిచ్చా



నాకు మూడు చక్రాల బండి ఉంది. మోటార్ సైకిల్ వస్తుందన్న ఆశతో బంగారం తాకట్టు పెట్టి డబ్బులిచ్చాను. నిలదీయగా చెక్కు ఇచ్చాడు. అది కూడా చెల్లని చెక్కు. ఫోన్ ఎత్తడం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాను.

- సూర్యప్రకాష్, వైఎస్ పాలెం


దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఆదర్శనీయులు దామోదరం సంజీవయ్య

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 14: దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆదర్శనీయులని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. సంజీవయ్య 103 జయంతిని పురస్కరించుకుని బుధవారం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంజీవయ్య చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. దామోదరం సంజీవయ్య క్రమశిక్షణ, పట్టుదల, ఓర్పు, సహనంతో అనేక విజయాలు సొంతం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో డి.పుష్పమణి, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్, కలెక్టరేట్ ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు, మెప్మా పీడీ ఇమ్మానియేల్, పొలిమేర హరికృష్ణ, మట్టారాజు, మెండెం సంతోష్‌కుమార్, ఎం.అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి


శిక్షణలో పాల్గొన్న పోలీసు అధికారులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 14: రాబోయే సార్వత్రిక ఎన్నికలలో నియమావళి పాటించాలని డీఎస్పీ ఈ శ్రీనివాసులు సూచించారు. ఏలూరు సబ్ డివిజన్‌లో వన్‌టౌన్, టూటౌన్, త్రీ టౌన్, కైకలూరు రూరల్, నిడమర్రు సీఐలు, ఎస్‌ఐలు పోలీస్ సిబ్బందికి బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని, ప్రతి విషయాన్ని సూక్ష్మంగా పరిశీలించి బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో పోలీసుల పాత్ర సురక్షిత, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడం అన్నారు. పౌరులు భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఓటరు అణిచివేత వ్యూహాలను నిరోధించడం, ఎన్నికల సామగ్రి, మౌలిక సదుపాయాలను కల్పించడం, భద్రపర్చడం, బ్యాలెట్ పేపర్లు, ఈవీఎం, వీవీప్యాట్ రక్షణ, రవాణా నిల్వ ఉండేలా చూడాలన్నారు. ర్యాలీలు, నిరసనలు సమయంలో ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో నేర చరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంచాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద నగదు, మద్యం, గంజాయి రవాణా అరికట్టడానికి విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యుత్ ఉద్యోగుల సస్పెన్షన్‌పై నిరసన


నిరసన తెలియజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 14: ఏపీ ఈపీడీసీఎల్‌లో నిర్వహణ సిబ్బంది, లైన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఎస్ఎల్ఐ కె.శ్రీనివాస్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) జిల్లా అధ్యక్షుడు ఎస్.నరసింహారావు ఆధ్వర్యంలో విద్యుత్ భవనం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సస్పెండ్ చేసిన సిబ్బందిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. నరసింహారావు మాట్లాడుతూ గతంలో ద్వారకా తిరుమలకు చెందిన ఏఎల్ఎం పి.ధర్మేంద్రకుమార్ మృతిచెందినప్పుడు ఎవరిని బాధ్యులను చేశారని ప్రశ్నించారు. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, ఇతర అలవెన్సులు ఎందుకు ఆలస్యమయ్యాయని ప్రశ్నించారు. అతి తక్కువ మంది సిబ్బందితో సేవలందిస్తున్నప్పటికీ యాజమాన్యం వేధింపులు తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరిగితే ఒక యూనియన్ సభ్యులను మాత్రమే బాధ్యులను చేయడం తగదన్నారు. ఫోన్, స్కానర్ ఇవ్వకుండా నిర్ణీత కాలపరిమితి విధించి రీడింగ్‌లు తీయించడం దుర్మార్గం అన్నారు. జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, డివిజన్ అధ్యక్షుడు కె.కృష్ణకుమార్, ఎంఆర్‌టి అధ్యక్షుడు రామ్‌బద్రిరాజు, డిస్కమ్ కంపెనీ ఆర్గనైజింగ్ సెక్రటరి కె.శౌరి పాల్గొన్నారు.

రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి


పొలంబడిలో పాల్గొన్న అధికారులు

భీమడోలు, ఫిబ్రవరి 14: వరి సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఫణికుమార్ సూచించారు. భీమడోలులో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. డీఏటీసీ కోఆర్డినేటర్ సుజాత రైతులకు సూచనలు ఇచ్చారు. వరి చేలను సందర్శించి దుబ్బు తెగులు నివారణకు సూచనలు ఇచ్చారు. ఆకుముడత తదితర తెగుళ్ళ నివారణ, వరి సాగులో జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 16న సామూహిక ఎలుక నివారణ కార్యక్రమం నిర్వహిస్తామని రైతులంతా ముందురోజు ఎలుక కన్నాలు మూసివేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏవో ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.

సీఆర్ రెడ్డి కళాశాల విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 14: సీఆర్‌రెడ్డి కళాశాల హెల్త్‌సెంటర్, ఎన్ఎస్ఎస్, జిల్లా రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్ సంయుక్తంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా వ్యాధిగ్రస్థుల కోసం నిర్వహించిన శిబిరాన్ని కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ ప్రారంభించారు. సుమారు 40మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కె.పద్మావతి, కడియం ప్రసాద్‌బాబు, చలపతిరావు, సెక్రటరి గోవిందరాజు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడి పాఠశాలలో ఉపాధ్యాయుల నిరసన


ఉంగుటూరులో ఉపాధ్యాయ, ఉద్యోగుల నిరసన


కొయ్యలగూడెంలో వినతిపత్రం ఇస్తున్న రెవెన్యూ ఉద్యోగులు


జంగారెడ్డిగూడెంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉద్యోగుల

ఉద్యమం

పీఆర్సీ, ఓపీఎస్‌కు డిమాండ్

తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా

చింతలపూడి, ఫిబ్రవరి 14: సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ దశల వారీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయులు స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ విధులకు హాజరయ్యారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పూరేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐఆర్ 30 శాతం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

● పోలవరం: ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలు చేసి ఐఆర్ ప్రకటించాలని ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దారు జీవీ.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, డైలీ, ఫుల్ టైం ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులతో వారంతా సతమతమవుతున్నారన్నారు. గత ఏడాది జూలై 1 నుంచి 12 వ పీఆర్సీ అమలు కావాల్సి ఉన్నా ఇప్పటివరకూ అమలు కాలేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించే విషయంలో నేటికీ స్పష్టత రాలేదన్నారు. నల్లబాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో మండల అధ్యక్షుడు బొంగు నాగేశ్వరరావు, పి పోశిబాబు, శర్మ, బి.ప్రసాద్, ఎస్‌బి.వెంకటేశ్వరరావు, టి.రాజాప్రేమ్‌చంద్, పీవీఆర్.లక్ష్మి, గంగాభవాని, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం నిమిత్తం పలు పాఠశాలల్లో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కొద్దిసేపు నిరసన తెలిపి డీటీ బొడ్డేపల్లి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉనుముల రాంబాబు, డాకి జోగి నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.శ్రీధర్, శీతాల సత్యనారాయణ, కమల్, హరికృష్ణ, వర్మ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులను మోసం చేసిందని ఉద్యోగులకు ఇవ్వవలసిన డీఏ బకాయిలు కూడా ఒక్కటి కూడా ఇవ్వలేదని ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగ దుర్గారావు అన్నారు బాలుర ఉన్నత పాఠశాల వద్ద చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరించారు. దళిత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.జయరాజు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం కోరితే అప్రెంటీస్ విధానం తెచ్చారన్నారు. ఐవి.రత్నం మాట్లాడుతూ పాతపెన్షన్ అమలయ్యే వరకు పోరాటం సాగుతుందన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ తక్షణమే ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతుంటే ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తుందన్నారు. కార్యక్రమంలో రాంబాబు, ఏసురత్నం, షరీఫ్, సంతోషి, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేసి అనంతరం వినతిపత్రం ఇచ్చారు. ఏపీ ఎన్‌జీవో కొయ్యలగూడెం యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాస్, కాకరపర్తి స్వామి మాట్లాడుతూ సరెండర్ లీవ్, మెడికల్ రియంబర్స్‌మెంట్, జీపీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డీఏ ఎరియర్స్, జీపీఎఫ్ బకాయిలు పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ సంఘ నేతలు రాంబాబు, వరకుమార్, అబ్బులు, తదితరులు పాల్గొన్నారు.


ఏలూరులో మహిళలతో మాట్లాడుతున్న బడేటి చంటి


తిమ్మాపురంలో మద్దిపాటి వెంకట్రాజు ప్రచారం


గోపీనాథపట్నంలో సమస్యలు తెలుసుకుంటున్న గన్ని

టీడీపీ విజయానికి కృషి చేయాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 14: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా కలసికట్టుగా పని చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి పిలుపునిచ్చారు. 39వ డివిజన్‌లో బెల్లంకొండ కిషోర్ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రజల్లో టీడీపీకి ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేయాలన్నారు. రోజులు గడుస్తున్న కొద్ది వైసీపీపై ప్రజల్లో విరక్తి కలుగుతుందన్నారు. ఆ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్‌లు కూడా దక్కని పరిస్థితులు ఉన్నాయన్నారు. సూపర్ 6 పథకాలను కార్యకర్తలంతా ప్రజల్లోకి తీసుకెళ్ళి విస్తృతప్రచారం చేయాలన్నారు.

● జీలుగుమిల్లి: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్-6 పథకాలతో ప్రతీ ఇంటికి ప్రయోజనం కలుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్ అన్నారు. ములగలంపల్లిలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ములగలంపల్లి, రౌతుగూడెం, పాకలగూడెం గ్రామాల్లో మేనిఫెస్టో వివరించారు. సుంకవల్లి సాయి, ఉండవల్లి సోమసుందరం, బాసిన రాజబాబు, నాలి శ్రీను, తోట బాలు, ఆకిరెడ్డి ప్రసాద్, కొప్పుల దుర్గారావు ఉన్నారు. టీపీపీ జనసేన కూటమిలో పోలవరం ఎమ్మెల్యే టికెట్ ఎవరికి కేటాయించినా సమన్వయంతో పనిచేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. సోషల్ మీడియా ప్రచారం అవాస్తవం అన్నారు.

● ద్వారకాతిరుమల: రాష్ట్రంలో అరాచక, సైకో పాలనకు సమాధి కట్టేలా తెలుగుదేశం పార్టీ ప్రజల్లోకి వెళ్తోందని గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. తిమ్మాపురంలో భవిష్యత్‌కు బాబు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో వివరించారు.

గోపీనాథపట్నంలో మన ఇంటికి మన గన్ని

ఉంగుటూరు: ప్రభుత్వం పేదల సమస్యలను పెడతోవ పట్టించిందని, పేదలు, యువతకు తగిన న్యాయం చేయాల్సిన అవశ్యకత ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. గోపీనాథపట్నంలో మన ఇంటికి మన గన్ని కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాతూరి విజయ్‌కుమార్, నల్లా ఆనంద్, పత్సా వంశీ, గంటా ఆంజనేయులు, చెరుకూరి హేమంత్, ఇమ్మణ్ణి గంగాధరరావు, అక్కిన నాగమణి, నేకూరి ఆశీర్వాదం, బూరుగుపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వసంత పంచమి పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 14: వసంత పంచమి సందర్భంగా నగరంలోని పలు ఆలయాల వద్ద బుధవారం అమ్మవారికి సరస్వతిదేవి అలంకరణలు చేశారు. సామూహిక అక్షరాభ్యాసం, విద్యార్థులు సరస్వతి పూజలు చేశారు. అంబికాదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అగ్రహారంలోని పాత శివాలయం ప్రాంగణంలోని జ్ఞాన సరస్వతి దేవి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత బస్టాం డ్ వద్ద పాండురంగస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై సరస్వతి దేవి ప్రతిరూపాన్ని ఉంచి సామూహిక పూజలు చేశారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కామవరపుకోట: తూర్పు యడవల్లిలోని నల్లగోపువారిగూడెంలో నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ బుధవారం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, టీడీపీ నేత గోరుముచ్చు గోపాల్‌యాదవ్, చిల్లమిల్లి వెంకట్రాయుడు, తూతా లక్ష్మణరావు, తోటకూర వెంకట్రావు, సర్పంచ్ పొన్నాల అనిత, స్థానికులు పాల్గొన్నారు.

జోగన్నపాలెంలో హోమాలు

దెందులూరు: జోగన్నపాలెం యోగలింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ సందర్భంగా 15రోజుల పాటు అగ్నిహోమాలు నిర్వహించనున్నారు. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి రాటను వేశారు. ఈ నెల 28న ఆలయంలో ధ్వజస్థంబం, శిఖర, చండేశ్వర, కాలభైరవ, ద్వారపాలక, జంటనాగుల పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాకులు ఆలూరి గోవిందరావు తెలిపారు. కొండేటి రాము, ఆలూరి నాగేశ్వరరావు, పాకలపాటి రామబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలకు ఏర్పాట్లు

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానుండడంతో ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. అమ్మవారిని దర్శించునేందుకు సుమారు లక్ష మంది భక్తులు రానున్నట్లు అంచనా వేసి తగినవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ స్వామి ఉత్సవ ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఆలయం వద్ద విద్యుత్ అలంకరణ, క్యూలైన్లు, స్టేజీ డెకరేషన్ చేశారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి అచ్చమ్మ పేరంటాలకు వేదపండితులు, బ్రాహ్మణులు పంచామృతాలతో అభిషేకం చేసి పుట్టింటి సారె, పసుపు, కుంకుమ, బోనాలు, నైవేద్యం సమర్పించి ఉత్సవాలను ప్రారంభిస్తారు.

మద్ది క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

జంగారెడ్డిగూడెం టౌన్: మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలోని ఉపాలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం నిర్వహించారు. అర్చకులు, వేద పండి తులు కల్యాణ మహోత్సవం నిర్వహించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండల రావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటి ఛైర్మన్ సరిత విజయ భాస్కర్ రెడ్డి, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ

నిడమర్రు: ఎనికేపల్లి గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణ పనులను పుప్పాల కుటుంబ సభ్యులు చేపట్టారు. సర్పంచ్ పుప్పాల మెహర్ కుమార్ దంపతు లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జడ్పీటీసీ కోడే కాశీ, ఎంపీపీ ధన కొండ ఆదిలక్ష్మి, సంకు సత్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్‌పై సమీక్ష

చింతలపూడి, ఫిబ్రవరి 14: మండల పరిషత్ కార్యాలయంలో జల్ జీవన్ మిషన్, గృహ నిర్మాణశాఖ సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. జల జీవన్ మిషన్ వలంటీర్లు సర్వే చేస్తున్నారని ఎంపీడీవో చినరత్నాలు తెలిపారు. గృహ నిర్మాణంపై సమీక్షించారు. ఎంపీపీ బి.రాంబాబు, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ ఏఈలు ఫణికుమార్, రవికిరణ్ పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 14: డ్రైవర్లకు ఉరితాడులాంటి హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే.గోపి డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆలయ ప్రాంగణంలో మంచినీటి సౌకర్యం



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న తపన చౌదరి

కామవరపుకోట, ఫిబ్రవరి 14: వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో తపన ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి పథకాన్ని ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, ఎస్ఆర్ఆర్. లక్ష్మీసూర్యనారాయణరాజు, ఒంటెద్దు ఏసు వరప్రసాద్, జెర్రిపోతుల లక్ష్మీపతి, కాకి సురేష్‌కుమార్, శ్యామ్‌శేఖర్, బలుసు లక్ష్మి, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొల్లేరు గ్రామాల్లో జబర్దస్త్ కళాకారుల ప్రచారం

ఏలూరు రూరల్, ఫిబ్ర వరి 14: జబర్దస్త్ కళాకారు లు, సినీ గాయకులు కొల్లేరు గ్రామాల్లో బుధవారం బీజేపీ తరపున ప్రచారం నిర్వహించారు. శ్రీపర్రు, జాలిపూడి, గుడివాకలంక, పైడి చింతపాడు గ్రామాల్లో మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, గారపాటి చౌదరి సేవా కార్యక్రమాలను వివరించారు. జబర్దస్త్ కళాకారులు, సినీ గాయకులు ప్రదర్శనలతో అలరించారు. కొల్లేరు ప్రజల తాగునీటి కష్టాలు తెలుసుకుని కలకుర్రులో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన ఘనత గారపాటి చౌదరికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ జి.చైతన్య, సురేష్, ఎస్.ఆనంద్‌బాబు, నారాయణరావు, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అటవీశాఖ అనుమతి ఇప్పించండి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 14: ఇళ్ల నిర్మాణాలకు అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని ఐటీడీఏలో బుధవారం జరిగిన గిరిజన దర్బార్‌లో కొండరెడ్లు ఏపీవో పీవీఎస్.నాయుడుకు వినతిపత్రం అందజేశారు. న్యూడెమోక్రసీ నాయకుడు బి.వినోద్ మాట్లాడుతూ వేలేరుపాడు మండలం కొయిదా, బుట్టాయగూడెం మండలం అలివేరులోని మోదేలు కొండరెడ్డిలో ప్రధాన మంత్రి నివాస యోజనలో నూతన ఇళ్ల మంజూరయ్యాయి. అటవీశాఖ అధికారి ఇళ్ల నిర్మాణాలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు.

డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 14: కేఆర్ పురం యువత శిక్షణ కేంద్రంలో డే స్కాలర్ విధానంలో గిరిజన యువతకు డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల గిరిజన యువత దరఖాస్తు చేసుకోవాలని పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. ఈ నెల 16 లోగా దరఖాస్తు చేసుకోవాలని 17 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, డీఎస్సీ రిజిస్ట్రేషన్ స్లిప్‌తో 9490285277 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

పల్లెకు పోదాం కార్యక్రమంలో బీజేపీ నాయకులు

లింగపాలెం: కలరాయినిగూడెం, భోగోలు, కొణిజర్ల గ్రామాల్లో బీజేపీ నేతలు బుధవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాయంకుల చక్రధర్‌రావు అధ్యక్షతన గ్రామాల్లో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పేదలకోసం బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింద న్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీజేపీని గెలిపించాలని వారు కోరారు. కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, తాతిన సత్యనారాయణ, మరీదు గంగబాబు, పరసా కిషోర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా బట్టీపై దాడి : ఇద్దరి అరెస్టు

పోలవరం, ఫిబ్రవరి 14: సారా తయారీ కేంద్రంపై దాడిలో ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు పంపినట్లు బుధవారం పోలవరం స్టేషన్ రైటర్ శ్రీనివాస్ తెలిపారు. ఎల్ఎన్‌డీపేట శివారులో సారా కాస్తున్నారనే సమాచారంతో ఈ నెల 6న దాడి చేశామన్నారు. అప్పుడు తప్పించుకున్న జక్కు వెంకటేశులు, జక్కు శివను బుధవారం ఉదయం అరెస్టు చేసి జంగారెడ్డిగూడెం కోర్టుకు పంపినట్లు తెలిపారు. వారి వద్ద మూడు వందల లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 2 వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు.

రహదారి దాటుతున్న వ్యక్తిని ఢీకొన్న ఆటో

ఉంగుటూరు, ఫిబ్రవరి 14: జాతీయ రహదారి దాటుతున్న వ్యక్తిని ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కైకరం వద్ద బుధవారం రోడ్డు దాటుతున్న పొడిపాటి ప్రకాశంను భీమవరం వైపు వెళుతున్న ఆటో ఢీకొంది. అతడి తలకు తీవ్ర గాయం కావడంతో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.


ఏలూరు సమావేశంలో మాట్లాడుతున్న జమలయ్య


చింతలపూడిలో రైతు, కార్మిక సంఘాల సమావేశం


భీమడోలులో రైస్ మిల్లు వద్ద కరపత్రాల ఆవిష్కరణ


కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

రేపు బంద్

మోదీ తీరుపై రైతు, కార్మిక సంఘాల ఆగ్రహం


ఏలూరులో వామపక్షాల మోటార్‌సైకిల్ ర్యాలీ

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 14: కేంద్రంలో మోదీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఈ నెల 16న బంద్ విజయవంతం చేయాలని నగరంలో వామపక్షాలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా మున్సిపల్ కార్యాలయంకు చేరుకుని నిరసన తెలిపాయి. సీపీఎం, సీపీఐ, ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ గతంలో ఢిల్లీలో 13 నెలల పాటు రైతులు చేసిన సమ్మె సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు నిర్ణయిస్తూ చట్టం చేయాలన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రైతు ఉద్యమంలో మరణించిన 750మంది రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ర్యాలీలో సీపీఎం, సీపీఐ, జిల్లా కార్యదర్శులు ఏ.రవి, ఎం.కృష్ణచైతన్య, ఇఫ్టూ నాయకులు బద్దా వెంకట్రావు, ఏపీ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ఎన్.నరసింహ పాల్గొన్నారు. ఈ నెల 16న గ్రామీణ బంద్, కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్ల అధ్యక్ష, కార్యదర్శులు శ్యామలా, ఎం.యామిని పిలుపునిచ్చారు.

ఢిల్లీలో రైతులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్, కోకన్వీనర్ ఆదిశేషు, వెంకట కృష్ణారావు తెలిపారు. దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలన్నారు.

రైతులపై దమనకాండ దారుణం

సమస్యల పరిష్కారం కోరుతూ ఢిల్లీ వెళుతున్న రైతులపై లాఠీచార్జీ, టియర్‌గ్యాస్‌తో దమనకాండను ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య ఖండించారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో కౌలు రైతుల కౌన్సిల్ సమావేశం రాజారావు అధ్యక్షతన బుధవారం జరిగింది. కౌల ్రైతులకు పంట రుణాలు అందించాలన్నారు. విద్యుత్ రంగం ప్రయివేటీకరణ ఆపాలన్నారు. విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. పంటలకు మద్దతు ధర చట్టం తీసుకురావాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య మాట్లాడుతూ కరువు తుపాన్ల వలన దెబ్బతిన్న పంటలకు పెట్టుబడిరాయితీ పంటల భీమా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణ, ఆర్.లక్ష్మణరావు, ప్రసాద్, సీహెచ్ నరసింహారావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి : మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో జరిగిన రైతు, కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలపై నిరసన తెలియజేయాలన్నారు. ఎం.బాలరాజు, టి.బాబు, జి.అంజమ్మ, సరోజిని, మాణిక్యం, బి.కృష్ణవేణి, వి.వెంకటేశ్వరరావు, పి.సోమశేఖర్, వి.అనురాధ, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

● ఉంగుటూరు: కైకరంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు 16న జరిగే బంద్‌పై కరపత్రాలను ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు.

● పోలవరం: గ్రామీణ బంద్, కార్మిక సంఘాల సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కె భాషా పిలుపునిచ్చారు. ఢిల్లీ వెళుతున్న రైతులపై మోదీ ప్రభుత్వ అమానుష నిర్బంధకాండను ఖండించారు. ఈ నెల 16న బంద్‌ను ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు రైతు కూలీ సంఘాలు, ఏజన్సీ గిరిజన సంఘాలు విజయవంతం చేయాలన్నారు. రైతులకు మద్దతు ధర, రుణమాఫీ కోసం పోరాటం చేస్తున్న రైతులపై హర్యానాలో బీజేపీ ప్రభుత్వం చేసిన దౌర్జన్య కాండకు, కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన అమలు చేస్తున్న మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు.

● భీమడోలు : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన కనీస మద్దతు ధర చట్టాన్ని అమలు చేయకుండా మోసగించిందని, లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులను బానిసలుగా మార్చిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు ఆరోపించారు. భీమడోలు, పూళ్ళ రైస్ మిల్లు సమీపంలో కార్మిక, కర్షక సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. రైతు సంఘాలు, కార్మిక సంఘాలు సమ్మె విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రీనివాస్, గుత్తికొండ వెంకట కృష్ణారావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్‌భూముల సవరణ చట్టం రద్దు చేయాలి

కొయ్యలగూడెం: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన అసైన్డ్‌భూముల ఆర్డినెన్స్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సోమరాజు కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అక్టోబర్ 31న జీవో నెం.572 తీసుకొచ్చి చిన్న, సన్నకారు రైతుల భూమిని కార్పొరేటర్లకు ధారదత్తం చేయాలనే ఉద్దేశంతో ఈ చట్టం తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ రిజిస్టార్‌లో నమోదు కాబడిన భూమిపై కోర్టులకు వెళ్లే వెసులుబాటు లేకుండా కేవలం రెవెన్యూ ట్రిబ్యునల్స్ ఇచ్చిన తీర్పుపై మాత్రమే హైకోర్టులో కేసులు వేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఇటువంటి చట్టాలు తీసుకొచ్చి పేద ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు సాలి రాజశేఖర్, ఎస్.బాలసుందరం, ఏసుబాబు, పూర్వం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కలెక్టరేట్ :** జిల్లాలోని ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఈనెల 16న ఎంప్లాయీ గ్రీవెన్స్ కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు.
- **ఏలూరు క్రైం :** జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రవాణాశాఖ ఉప కమీషనర్ ఎస్ శాంత కుమారి తెలిపారు. ఏలూరు శాంతినగర్ పోలీస్ పెట్రోల్ బంక్ నుంచి ఈ ర్యాలీ ప్రారంభం అవుతుందని తెలిపారు.
- **ఏలూరు రూరల్ :** పైడిచింతపాడులో ముంగర చక్రధర్,చంద్రలక్ష్మి దంపతుల కుమారులు ఇటీవల హరినాథ్ (8), కృష్ణరాజ్ (5) చేపలచెరువులో పడి మృత్యువాత పడ్డారు. కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ మాగంటి బాబు పరామర్శించి త్రిబుల్‌ఆర్ ట్రస్ట్ ద్వారా రూ.20వేలు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు.
- **టి.నరసాపురం :** మధ్యాహ్నపువారిగూడెం శివార్లలో సారా తయారీ సమాచారంతో హెచ్‌సీ ఎం.రాజు, సిబ్బంది దాడి చేశారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. బెల్లం ఊటను ధ్వంసం చేశారు.
- **చింతలపూడి :** ప్రగడవరం గ్రామానికి చెందిన గంధం సత్యనారాయణ మృతి చెందడంతో రెయిన్‌బో పార్మా కంపెనీ ఇచ్చిన రూ.5 వేలను టీడీపీ నేత తాళ్ళూరి చంద్రశేఖరరెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు.
- **బుట్టాయగూడెం :** అంతర్వేదిగూడెంకు చెందిన కొవ్వాసు రాజ్‌కుమార్ మృతి చెందడంతో టీడీపీ ఎస్టీ సెల్ నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి వెంకటేష్, లక్ష్మీ దంపతులకు ఆర్థికసాయం అందజేశారు.
- **పెదపాడు :** తాళ్ళమూడిలో నిర్మించిన పంచాయతీ భవనం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, పాల సేకరణ కేంద్రాన్ని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరితో కలిసి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించారు.
- **వేలేరుపాడు :** మండలంలోని 24 మహిళా సంఘాలకు రూ.82,42,712 ఆసరా చెక్కులను తెల్లం రాజ్యలక్ష్మి అందజేశారు.
- **కుక్కునూరు :** మండలంలో 794 స్వయం సహాయక సంఘాలకు ఆసరా క్రింద దాదాపు రూ.40 కోట్లు తెల్లం రాజ్యలక్ష్మి పంపిణీ చేశారు.
- **టి.నరసాపురం :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డస్ట్ బిన్లను జడ్పీటీసీ సూర్యనారాయణ రాజు పంపిణీ చేశారు. మండలానికి 40,500 డస్ట్ బిన్లు వచ్చినట్లు ఆయన తెలిపారు.


ఆంజనేయస్వామి గుడి వద్ద చేపట్టిన అక్రమ నిర్మాణాలు

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 14: పల్లెర్లమూడి హనుమంతుని ఆలయం వద్ద రహదారుల ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తూ అదేమంటే ప్రజాప్రయోజనాల కోసం నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పి వాటిని స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై పల్లెర్లమూడి గ్రామానికి చెందిన వార్డుసభ్యుడు యనమదల శ్రీనివాసరావు తాను స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. రహదారి మార్జిన్‌లను ఆక్రమిస్తూ పక్కా నిర్మాణాలు చేస్తున్నా సచివాలయ సిబ్బంది కానీ, ఇతర అధికారులు కానీ కనీసం చర్యలు చేపట్టలేదని ఆయన ఆరోపించారు. దీనిపై జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను అరికట్టాలని కోరారు.



మినుము రైతులను ఆదుకోవాలి

ముదినేపల్లి, ఫిబ్రవరి 14 : నీటి ఎద్దడి కారణంగా మినుము పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. తెలుగుయువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు నీలిపల్లి సన్యాసిరావు, బొమ్మనబోయిన వెంకట రత్నం, ముంద్రు బాలరాజు, దాసరి శ్రీను, శీలం చిన వెంకటేశ్వరరావు, పత్తి శ్రీను తదితరులు ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలో నీరందక ఎండిపోయిన, కాయరాలిపోయిన మినుము పైరును పరిశీలించారు. రెండో పంటగా మినుము సాగుకు సబ్సిడీపై మినప విత్తనాలు సరఫరా చేసిన ప్రభుత్వం, ఆ పైరును కాపాడుకునేందుకు నీరివ్వటంలో విఫలమైందని నాయకులు పేర్కొన్నారు. వేలాది రూపాయల పెట్టుబడిని కోల్పోయామని పలువురు రైతులు టీడీపీ నాయకులకు వివరించారు. తుపాను వల్ల సార్వా పంట కోల్పోయిన మినప సాగుపై ఆశలు పెట్టుకున్న రైతులకు నీటి ఎద్దడి కారణంగా మినుము పంట కూడ పాడైందని ప్రభుత్వం పెట్టుబడి రాయితీ ఇచ్చి ఆదుకోవాలని నాగరాజు కోరారు.

పెద్ద శేష వాహనంపై ఊరేగిన శోభనాచలుడు



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 14: ఆగిరిపల్లి శోభనగిరిపై కొలువై ఉన్న శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి రథసప్తమి తిరునాళ్ళ సందర్భంగా ఐదో రోజు బుధవారం భక్తులకు స్వామివారు పెద్దశేష వాహనంపై దర్శనం ఇచ్చారు. ఉదయం 9 గంటలకు జరిగిన శాంతి కల్యాణంలో కాళహస్తి రాజేశ్వరరావు దంపతులు, రాత్రి 9 గంటలకు జరిగిన నిత్య కల్యాణంలో కాపు సంఘంవారు కైంకర్యంలో పాల్గొన్నారు. రాత్రి గ్రామోత్సవంలో బేతాళ నృత్యాలు డప్పు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామివారి కల్యాణం తిలకించటానికి భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణ మండపానికి విచ్చేశారు.


చనుబండ చర్చిలో ఉపవాస దీక్షలలో క్రైస్తవుల ప్రార్థనలు


ఉపవాస దీక్షలు ఇస్తున్న ఫాదర్


పాస్టర్ ఐజాక్ జాన్

క్రైస్తవుల ఉపవాస దీక్షలు ప్రారంభం

చాట్రాయి, ఫిబ్రవరి 14: మండలంలో క్రైస్తవుల 40 రోజుల ఉప వాస దీక్షలు బుధవారం ప్రారంభమ య్యాయి. చాట్రాయి, చనుబండ, కోటపాడు ఆర్సీఎం చర్చిల ఫాదర్లు నరేష్, జయరాజు ఏసు దీక్షాధారులకు జపమాల వేసి ఉపవాస దీక్ష నియమాలను వివరించారు. ఉప వాస దీక్ష 40 రోజులు దీక్షాధారులు పరిశుద్ధ ఆత్మతో క్రీస్తు నామాన్ని జపిస్తూ తోటివారి పట్ల ప్రేమ, దయ కరుణ కలిగి ఉండాలని ఉపదేశించారు. సామూహిక ప్రార్థనలు జరిగాయి.

ఆగిరిపల్లి: మండల పరిధిలోని కనసానపల్లి పరిశుద్ధ పౌల్ సీఎస్ఐ చర్చిలో బుధవారం క్రైస్తవ ఉపవాస ప్రార్థనలు ప్రారంభించారు. పాస్టర్ ఐజాక్ జాన్ మాట్లాడుతూ బుధవారం నుంచి ఈస్టర్ ముందు రోజు వరకు 40 రోజులు క్రైస్తవులు ఉపవాస దినాలు అన్నారు. పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న పోలీసు అధికారులు

ఎన్నికల నియమావళి పాటించాలి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 14: రాబోయే సార్వత్రిక ఎన్నికలలో నియమావళి పాటించాలని డీఎస్పీ ఈ శ్రీనివాసులు సూచించారు. ఏలూరు సబ్ డివిజన్‌లో వన్‌టౌన్, టూటౌన్, త్రీ టౌన్, కైకలూరు రూరల్, నిడమర్రు సీఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బందికి బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని, ప్రతి విషయాన్ని సూక్ష్మంగా పరిశీలించి బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో పోలీసుల పాత్ర సురక్షిత, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడం అన్నారు. పౌరులు భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఓటరు అణిచివేత వ్యూహాలను నిరోధించడం, ఎన్నికల సామగ్రి, మౌలిక సదుపాయాలను కల్పించడం, భద్రపర్చడం, బ్యాలెట్ పేపర్లు, ఈవీఎం, వీవీప్యాట్ రక్షణ, రవాణా నిల్వ ఉండేలా చూడాలన్నారు. ర్యాలీలు, నిరసనలు సమయంలో ఆటంకాలు, అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో నేర చరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంచాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద నగదు, మద్యం, గంజాయి రవాణా అరికట్టడానికి విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.

సచివాలయ భవనాలు ప్రారంభం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 14: మండలంలో అభివృద్ధి పనులను బుధవారం నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ ప్రారంభించారు. వట్టిగుడిపాడులో జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికి కుళాయి పనులతో పాటు ఈదులగూడెంలో గ్రామ సచివాలయ, హెల్త్ క్లినిక్ తదితర భవనాలు ప్రారంభించారు.


పెదగొన్నూరులో కూలిన పశువుల ఆసుపత్రి భవనం

ప్రభుత్వ భవనాల నిర్వహణ లోప భూయిష్టంగా ఉండటంతో శిథిలమై కూలే దశకు చేరుకుంటున్నాయి. ఏ శాఖ చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్లు అన్ని శాఖల భవనాలు ఆ దారిలోనే ఉన్నాయి. కార్యాలయాల భవనాలపై చెట్లు మొలిచి వృక్షాలవుతున్నా అధికారులు పట్టించుకోకపోవటంతో ఆ భవనాలు బీటలు వారి కూలిపోతున్నాయి. చిన్న మొక్కగా ఉన్న సమయంలో అధికారులు, సిబ్బంది చూస్తూ ఊరుకోవటమే తప్ప తొలగించటంలో నిర్లక్ష్య వైఖరి అవలంబించడంతో లక్షలాది రూపాయల విలువైన పెద్ద భవనాలు కూలిపోయాయి.

మొక్కే అని వదిలేస్తే..

కూలుతున్న భవనాలు.. పట్టించుకోని అధికారులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 14 : ముదినేపల్లి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, పశువుల ఆసుపత్రి భవనాలపై చెట్లు పెరగటం వల్ల పాడైపోయి పనికి రాకుండా పోయాయి. అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి కూడా కొన్ని చోట్ల అలాగే ఉంది. ముదినేపల్లిలో సుమారు రూ.2 కోట్లు విలువ చేసే పశువుల ఆసుపత్రి భవనం, పెదగొన్నూరులోని పశువుల ఆసుపత్రి భవనంపై మొక్కలు కాస్తా వృక్షాలు కావటంతో స్లాబులు కూలిపోయాయి. ఆ భవనాలపై ఇంకా మొక్కలు పెరుగుతూనే ఉన్నాయి. కళ్లెదుటే మొక్కలు పెరిగి భవనాలు బీటలు వారుతున్నా పశు సంవర్ధకశాఖ అధికారులు పట్టించుకోని కారణంగా తిరిగి ముదినేపల్లిలో లక్షలాది రూపాయల వ్యయంతో పశువుల ఆసుపత్రి భవనాన్ని నిర్మించాల్సి వచ్చింది. పెయ్యేరులోని అంగన్‌వాడీ కేంద్రం భవనం, అల్లూరులోని పశువుల ఆసుపత్రి భవనంపై మొక్కలు పెరగ్గా, స్లాబులు బీటలు వారుతున్నాయి. ముదినేపల్లిలో బ్రిటిష్ పాలకుల హయాంలో నిర్మించిన విశ్రాంతి భవనంపై చెట్లు పెరుగుతున్నా అధికారులు అలా వదిలేసి కూలిపోతుంటే చూస్తున్నారే తప్ప కాపాడేందుకు చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ భవనం పాడుబడిపోయింది. పలు గ్రామాల్లోని పంచాయతీల కార్యాలయాలు, పాఠశాల భవనాలపై కూడా మొక్కలు మొలిచి పెరగుతున్నాయి. దీనిపై ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకుని భవనాలు శిథిలం కాకుండా చూడాల్సిన అవసరం ఉంది.


పెయ్యేరులో అంగన్‌వాడీ భవనంపై..


ముదినేపల్లిలో గోడలపై చెట్లు మొలిచి కూలిన బ్రిటిష్ పాలకుల విశ్రాంతి భవనం



అల్లూరులో పశువుల ఆసుపత్రి సన్‌షేడ్‌పై పెరుగుతున్న మొక్కలు


మునునూరు ఎంఈవో కార్యాలయ ఉద్యోగికి కార్మికుల బంద్ నోటీసు..


నూజివీడులో మాట్లాడుతున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

ముసునూరు, ఫిబ్రవరి 14: కార్మికుల సమస్యలపై ఈ నెల 16న చేపట్టిన భారత్ బంద్‌ను అన్ని కార్మిక సంఘాలు ఐక్యతగా విజయవంతం చేయాలని ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆలిండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (ఏఐసీసీటీయూ) అనుబంధ మిడ్డేమీల్స్ - శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎంఈవో కార్యాలయ ఉద్యోగికి బంద్ నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడుతూ 20 ఏళ్లకు పైగా మిడ్డేమీల్స్, శానిటేషన్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నా నేటికి వారిని కార్మికులుగా గుర్తించకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్న రాష్ట్రప్రభుత్వం, నేడు కేంద్రప్రభుత్వ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కట్టుబానిసలుగా చేయటానికి చూస్తుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించటం మాని బీజేపీ సర్కార్‌కు వంగి వంగి దండాలు పెడుతోందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఈ ప్రభుత్వాలకు బుద్ధిచెప్తామని హెచ్చరించారు. భారత్ బంద్‌కు అన్ని కార్మిక యూనియన్‌లు మద్ధతిచ్చి విజయవంతం చేయాలని కోరారు. మిడ్డేమీల్స్, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దేవమాత, కంకట శిరోమణి, కార్మికులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి..

నూజివీడు టౌన్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. నూజివీడు అమర్‌భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీఐటీయూ కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ఇందుకు నిరసనగా ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు నందూరి హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.


మండవల్లిలో సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

సంజీవయ్యకు ఘన నివాళి

మండవల్లి, ఫిబ్రవరి 14: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను మండవల్లిలో బుధవారం నిర్వహించారు. మండవల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొరపాటి శాంతరాజు, మాజీ అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, ఉపాధ్యక్షుడు పాగోలు అభిషి మాట్లాడుతూ సంజీవయ్య సేవా దృక్పథాన్ని, ఆయన చేపట్టిన సంస్కరణలను కొనియాడారు. చాబత్తిన విజయ్, కొండపల్లి రవి, వరప్రసాద్, దాకరపు వినోద్‌కుమార్, గోరింక గాంధి, వట్టిప్రోలు సుధీర్, మెండా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రో వెల్' క్లీన్ అండ్ గ్రీన్

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 14: క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా శ్రీహరిపురం గ్రామంలోని గ్రోవెల్ ఫ్యాక్టరీ యాజమాన్యం సిబ్బంది మచిలీపట్నం బీచ్‌లోని వ్యర్థాలను ఏరి శుభ్రం చేశారు. ప్రతి ఏటా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా గ్రోవెల్ యాజమాన్యం ప్రజలను చైతన్య పరుస్తోంది.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

విద్యాభివృద్ధికి అధునాతన భవనాలు

కైకలూరు, ఫిబ్రవరి 14: విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధునాతన భవనాలను నిర్మిస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కైకలూరు జడ్పీ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో రూ.67.50లక్షల నిధులతో నిర్మించిన అదనపు తరగతుల నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీపీ అడవి కృష్ణ, జడ్పీటీసీ కురేళ్ళ బేబి, సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ ఎండీ జహీర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాట పూజ

కలిదిండి: కలిదిండిలోని పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు పురస్కరించుకుని బుధవారం స్వామివారి ఆలయం వద్ద పందిరి వేయటానికి ఎమ్మెల్యే డీఎన్నార్ దంపతులు రాట పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్చి 6వ తేదీ నుంచి జరిగే శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, సర్పంచ్ మారుతీ ప్రసన్న, సొసైటీ ఛైర్మన్ వడుపు రామారావు, ఏఎంసీ ఛైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నున్న భగవాన్లు పాల్గొన్నారు.


కానుకొల్లు వీఆర్వో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

అర్హులకు పట్టాలివ్వాలి

మండవల్లి, ఫిబ్రవరి 14: మండవల్లి మండలం కానుకొల్లు గ్రామంలో జగనన్న కాలనీలో అనర్హత కల్గిన వారికి పట్టాలు ఇచ్చారని వాటిని తొలగించి అర్హత కల్గిన లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం కానుకొల్లు వీఆర్వో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వైసీపీ నాయకులు చేస్తున్న ఆగడాలు ఎండగడుతూ నినాదాలు చేశారు. అర్హులకు ఇళ్లపట్టాలు ఇవ్వకుండా అనర్హులకు ఇళ్లపట్టాలు ఇచ్చారని పలువురు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కోర్టు ఆదేశాలను కూడా అధికారులు వైసీపీ నాయకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనర్హత కల్గిన వారిని తొలగించి అర్హత కల్గిన వారికి పట్టాలు ఇవ్వాలని కోర్టు సిఫార్సు చేసినప్పటికీ అనర్హులను వెంటబెట్టుకుని ప్రభుత్వ అధికారులు సర్వే చేస్తున్నారని, దీనిని నిరసిస్తూ ధర్నా చేశారు. అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. టీడీపీ నాయకులు పీజేఎస్ మాల్యాద్రి, వీరవల్లి శివయ్య, తలారి రాజేష్, కోసూరి మాణిక్యాలరావు, జోసఫ్ తంబి, రాజు, మాజీ సర్పంచ్ గూడవల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ముసునూరు, ఫిబ్రవరి 14: గోపవరం ఎస్సీ కాలనీకి చెందిన పాముల దానియేలు ఇల్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమవడంతో కుటుంబం మొత్తం నిరాశ్రయమైంది. టీడీపీ నాయకుడు ఉప్పలపాటి గణేష్ బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు రూ.5 వేలు నగదును టీడీపీ కార్యకర్త సాయి ద్వారా అందజేశారు.

ఇల్లు దగ్ధం


పరిశీలిస్తున్న వీఆర్వో

ముసునూరు, ఫిబ్రవరి 14: గోపవరంలో బుధవారం పాముల బాబూరావు నివాస గృహం అగ్నికి ఆహుతైంది. ఉదయం 9 గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విలువైన వస్తువులతో పాటు రూ.23 వేలు నగదు, పిల్లల చదువుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సైతం కాలిబూడిదయ్యాయి. చుట్టుపక్కల వారు మంటలార్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దగ్ధమైన ఇంటిని వీఆర్వో శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శి సుకుమార్ పరిశీలించి సుమారు లక్షా 50 వేలు ఆస్తినష్టం వాటిల్లినట్టుగా నివేదికను తహసీల్దార్‌కు అందజేశారు. ప్రభుత్వ పరంగా నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయాన్ని త్వరలోనే అందజేస్తామని అధికారులు తెలిపారు.

నూజివీడు డీఎస్పీగా మురళీకృష్ణ



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 14: నూజివీడు డీఎస్పీగా సీహెచ్ మురళీకృష్ణను నియమిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మచిలీపట్నం సీసీఎస్ డీఎస్పీగా ఉన్న ఆయనను నూజివీడు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఇక్కడ పనిచేసిన అశోక్‌కుమార్‌గౌడ్‌ను విజయవాడ ట్రాఫిక్ డీఎస్పీగా బదిలీ చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



చాట్రాయి ఫిబ్రవరి 14: మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ మహ్మద్ మసూద్ అలీ, ఎంపీడీవో మంగాకుమారి, ఏఎస్సై గజపతి రావు పరిశీలించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, దివ్యాంగులకు ర్యాంపులు ఇతర మౌలిక సదుపాయాలు పరిశీలించారు.



నూజివీడులో సరస్వతీ అమ్మవారు.. కైకలూరులో అక్షరాభ్యాసాలు

ఘనంగా వసంత పంచమి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 14: వసంత పంచమిని పురస్కరించుకుని ఆంధ్రా బాసరగా పేరుగాంచిన నూజివీడు సరస్వతీదేవి ఆలయంలో భక్తులు విశేషంగా పాల్గొని పూజలు చేశారు. అక్షరాభ్యాసం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలతో పాటు తెలంగాణలోని ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల నుంచి భక్తులు హాజరై తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. 602 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం జరిగినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

శ్రీశ్యామలాంబ ఆలయంలో..

కైకలూరు: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి నవరాత్రుల సందర్భంగా అమ్మవారు సర్వసిద్ధి మాతాంగిగా దర్శనమిచ్చారు. బుధవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలిరాగా కైకలూరుకు చెందిన గుళ్ళపల్లి వెంకటేశ్వరరావు దంపతులు ఉభయపూజలు నిర్వహించారు. వసంత పంచమిని పురస్కరించుకుని పిల్లలకు సామూహిక అక్షరభ్యాసాలు పెద్దఎత్తున నిర్వహించారు. విద్యార్థులకు ఆలయం తరపున పుస్తకాలు, పెన్నులను అందించారు. గురువారం అమ్మవారు వాస్య మాతాంగిగా దర్శనమివ్వనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎస్‌కె శేఖర్ తెలిపారు. అలాగే ఈ నెల 16న రథసప్తమి సందర్భంగా శ్రీశ్యామలాంబ ఆలయం, మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్యనమస్కారాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించను న్నట్లు ఆలయ అధికారి తెలిపారు.

రేపు కలిదిండి మండల పరిషత్ సమావేశం

కలిదిండి, ఫిబ్రవరి 14 : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16న ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 14: ఆగిరిపల్లిలోని ఎన్నారై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు, టెక్ మహీంద్ర ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ బెంజ్ సర్కిల్‌లో వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌పై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు నివారించాలంటే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. విజయవాడ డీసీపీ కడియం చక్రవర్తి హాజరై భద్రత నిబంధనలపై ముద్రించిన పోస్టర్లు ఆవిష్కరించారు. సీఐ రాజేంద్రప్రసాద్, టెక్ మహీంద్ర రిక్రూట్‌మెంట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఎన్నారై కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి సురేంద్రబాబు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ నాగబాబు పాల్గొన్నారు.



నూజివీడు టౌన్: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నూజివీడు త్రివిధ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై నూజివీడు ఎంవీఐ మురళీకృష్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మైలవరం డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జమలయ్య వాహనాలు నడిపే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. త్రివిధ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

గోశాలకు గ్రాసం వితరణ



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 14: ఆగిరిపల్లిలో శ్రీశోభనాచల లక్ష్మీ నరసింహ వేద పాఠశాలలో గల గోశాలకు దాత పి. వేణుగోపాలరెడ్డి తన తల్లి సరోజినీ జ్ఞాపకార్థం రూ. 15 వేలు విలువైన వరిగడ్డి అందజేశారు. దాతను వేద పాఠశాల కార్యదర్శి సూరిశర్మ అభినందించారు.

స్టడీ మెటీరియల్ వితరణ



మండవల్లి, ఫిబ్రవరి 14: లోకుమూడిలోని శ్రీగణపతి సచ్చిదానంద స్వామిజీ దత్తాశ్రమం ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. దత్తాశ్రమం అధికారి గురజాడ ఉదయశంకర్ చేతుల మీదుగా స్టడీ మెటీరియల్, ప్యాడ్స్, పెన్నులు విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పి. వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ పి. నరసింహారావు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.